



DD9 వార్త
తెలుగు దినపత్రిక

సక్సెస్ లేకపోయినా తగ్గేదేలే..



07

సంపుటి : 01 సంచిక : 214 హైదరాబాద్, మార్చి, మంగళవారం 24, 2026 పేజీలు : 07 వెల : 3.00

# పదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు?

అసెంబ్లీలో ప్రతిపక్షంపై మంత్రి సీతక్క ఆగ్రహం
హరీష్ రావు విమర్శలకు ఘాటు స్పందన
బీఆర్ఎస్ పదేళ్ల పాలనను ఎండగట్టిన మంత్రి
గత పాలనలో చేసిన అప్పులపై విమర్శలు
అప్పులతో ఏం చేశారో లెక్క చెప్పాలని సవాల్
రుణమాఫీ ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నలు
నిరుద్యోగులను వంచించారని ఆగ్రహం



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ అసెంబ్లీ వేదికగా అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. బడ్జెట్ చర్చల సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు చేసిన విమర్శలపై పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. నిరుద్యోగ భృతి, నోటిఫికేషన్లు, రైతు రుణమాఫీ వంటి అంశాలపై హరీష్ రావు వేసిన ప్రశ్నలకు సీతక్క సూటిగా, ఘాటుగా సమాధానమిచ్చారు. పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రానికి అప్పుల కుప్పను అప్పగించి, ఇప్పుడు ఆరు నెలల పాలనపై విమర్శలు చేయడం హాస్యాస్పదమని ఆమె

..మిగతా 2లో

# విశ్వనగరంగా హైదరాబాద్!

ట్రాఫిక్ కష్టాలకు ముగింపు పలుకుతాం
మెట్రో విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్లతో అభివృద్ధి
రూ.24 వేల కోట్లతో
76 కిలోమీటర్ల మెట్రో రెండో దశ
ట్రాఫిక్ ఫ్రీ సిటీ కోసం
అండర్ పాస్, సర్ఫేస్ రోడ్లు
ఎలివేటెడ్ కారిడార్ల
త్రిముఖ వ్యూహం
కంటోన్మెంట్
అడ్డంకులు తొలగింపు
బేగంపేట ఎయిర్‌పోర్ట్
రన్ వే కింద టన్నెల్ నిర్మాణం
శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు
నేరుగా మెట్రో కనెక్టివిటీ
ఐటీ కారిడార్‌లో
నియోపోలిస్ వరకు పొడిగింపు
శాసన మండలిలో
సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన



**హైదరాబాద్, (డిడి9 వార్త):**


భాగ్యనగరాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం భారీ ప్రణాళికలను సిద్ధం చేసింది. ముఖ్యంగా నగరవాసులను వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడమే లక్ష్యంగా మెట్రో విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. శాసనమండలిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధికి సంబంధించిన రోడ్ మ్యాప్‌ను వివరించారు. ఓఆర్ఆర్ (ORR) లోపల ఉన్న ప్రాంతాన్ని ఒకే గొడుగు కిందకు తెచ్చి, సమగ్ర అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ

..మిగతా 2లో

# బడ్జెట్ అంటే అంకెల గారడీయేనా?

అసెంబ్లీలో సర్కారుపై
హరీష్ రావు విమర్శలు
రైతు భరోసా
హామీపై ప్రశ్నల వర్షం
ఎకరాకు రూ.15 వేలు
అని మాట తప్పారని ఆరోపణ
ఇందిరమ్మ భరోసా
ప్రస్తావనే లేదని ఎద్దేవా

మూడు సీజన్ల పెట్టుబడి సాయం ఎగ్గొట్టారని ఆగ్రహం
రైతు కూలీలకు ఏడాదికి రూ. 12 వేలు ఏమైందన్న మాజీ మంత్రి
మద్యం ఆదాయంపైనే ప్రభుత్వం ఆధారపడిందన్న హరీశ్
రూ. 12 వేల కోట్ల అదనపు టార్గెట్ వెనుక మతలబు ఏంటని ప్రశ్న
ప్యూరిటీ, క్లారిటీ లేని బడ్జెట్ అంటూ అసంతృప్తి



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ శాసనసభలో బడ్జెట్‌పై జరిగిన చర్చా వేదికగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వాస్తవాలు తక్కువ, అంకెల గారడీ ఎక్కువ ఉందని ఆయన ఎండగట్టారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ముఖ్యంగా రైతులకు, నిరుద్యోగులకు ఈ బడ్జెట్ తీవ్ర నిరాశను మిగిల్చిందని మండిపడ్డారు. ప్రభుత్వం చెప్పే మాటలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులకు అస్సలు పొంతన లేదని గణాంకాలతో సహా వివరించారు.

**రైతు భరోసాపై 'కౌంటర్' దాడి**

ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేతలు ఊరూరా తిరిగి ఎకరానికి రూ. 15 వేల రైతు భరోసా ఇస్తామని హామీ ఇచ్చారని హరీష్ రావు గుర్తు చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీని అటకెక్కించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరోనా వంటి

..మిగతా 2లో

## ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కోరుతూ బీఆర్ఎస్ ప్రైవేట్ మెంబర్ బిల్లు

ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత
కోరిన బీఆర్ఎస్
అసెంబ్లీలో ప్రైవేట్ మెంబర్
బిల్లు నోటీసు
పథకాల అమలులో
పారదర్శకతపై దృష్టి
బడ్జెట్ సమావేశాల్లోనే
చర్చకు డిమాండ్

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే ప్రైవేట్ మెంబర్ బిల్లుకు సంబంధించిన నోటీసును స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , పార్టీ ఎమ్మెల్యేలు అందజేశారు. ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లుతో ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే అవకాశం ఉంటుందని కేటీఆర్

..మిగతా 2లో



## దానం నాగేందర్ కు హైకోర్టు నోటీసులు..!

దానం పార్టీ మారలేదని
తెలంగాణ అసెంబ్లీ స్పీకర్
నిర్ణయాన్ని సవాల్ చేస్తూ..
బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి
హైకోర్టులో పిటిషన్ దాఖలు..
నాలుగు వారాల్లో వివరణ ఇవ్వాలని
దానం నాగేందర్ కు హైకోర్టు ఆదేశం..
విచారణ వచ్చేనెల 16 కు వాయిదా..



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కు తెలంగాణ హైకోర్ట్ నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులో పార్టీ మార్పు అంశంపై నాలుగు వారాల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను వచ్చే నెల 16వ తేదీకి వాయిదా

..మిగతా 2లో

## మహిళా రిజర్వేషన్ల అమలుకు కేంద్రం సిద్ధం

2011 జనాభా ఆధారంగా
రిజర్వేషన్ అమలు
నియోజకవర్గాల
పునర్విభజనపై కసరత్తు
రాజ్యాంగ సవరణలకు
కీలక నిర్ణయాలు
వచ్చే వారం పార్లమెంట్‌లో
బిల్లుకు అవకాశం
కొత్త చట్టం ప్రకారం సీట్లు
816కు పెంపు
33 శాతంతో మహిళలకు
273 సీట్లు కేటాయింపు
ప్రతిపక్షాల మద్దతు కోసం
బీజేపీ ప్రయత్నాలు



**నేషనల్‌బ్యూరో, (డిడి9 వార్త):**

దేశంలో మహిళలు రాజకీయాల్లో సమాన భాగస్వాములు కావాలనే లక్ష్యంతో గతంలో తీసుకొచ్చిన చట్టం ఇప్పటి వరకు అమలు కాలేదు. దీనికి ముఖ్య కారణం నియోజకవర్గాల పునర్విభజన పని ఇంకా పూర్తి కాలేదు. కానీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఒక కొత్త మార్గం చూపించింది. 2011 జనాభా లెక్కలను ఆధారం చేసుకొని మహిళా

..మిగతా 2లో

# విశ్వనగరంగా హైదరాబాద్!

మొదటిపేజీ తరువాయి



ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు.

మెట్రో రెండో దశ: 76 కిలోమీటర్ల విస్తరణ హైదరాబాద్ మెట్రో గత పదేళ్లలో విస్తరణ లేక దేశంలో 9వ స్థానానికి పడిపోయిందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని సరిదిద్దేందుకు రూ. 24 వేల కోట్లతో రెండో దశ పనులను చేపట్టబోతున్నట్లు ప్రకటించారు. 76 కిలోమీటర్ల మేర సాగే ఈ విస్తరణలో భాగంగా, నగర శివారు ప్రాంతాలైన హయత్‌నగర్, రామచంద్రాపురం వంటి లాస్ట్ మైల్ కనెక్టివిటీ ప్రాంతాలను మెట్రోతో అనుసంధానించనున్నారు. ఎల్ అండ్ టీ సంస్థ ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకోవాలని భావిస్తున్న తరుణంలో, కేంద్ర నిబంధనల ప్రకారం మెట్రోను ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని పనులు పూర్తి చేయాలని నిర్ణయించింది.

**ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీపై ప్రత్యేక దృష్టి**

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికుల కోసం మెట్రో మార్గాన్ని మార్పు చేశారు. నాగోల్, ఎల్బీనగర్, ఓవైసీ హాస్పిటల్, చాంద్రాయగుట్ట, రాజేంద్రనగర్ మీదుగా విమానాశ్రయం వరకు మెట్రోను పొడిగిస్తున్నారు. పాతబస్తీలో ఆగిపోయిన పనులను పునరుద్ధరించి ఫలక్‌నుమా నుంచి చాంద్రాయగుట్ట జంక్షన్‌కు కనెక్ట్ చేస్తున్నారు. అలాగే ఐటీ కారిడార్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నియోపోలిస్ వరకు మెట్రోను విస్తరించి లక్షలాది మంది ఐటీ ఉద్యోగుల ప్రయాణ కష్టాలను తీర్చనున్నారు.

**కంటోన్మెంట్ అడ్డంకులు తొలగింపు..**
**అండర్ టన్నెల్ నిర్మాణం**

ఉత్తర తెలంగాణ వైపు వెళ్లే కరీంనగర్, మేడ్చెల్ మార్గాల్లో కంటోన్మెంట్ ప్రాంతం పెద్ద బాటిల్ నెక్‌గా మారింది. దీనిని తొలగించేందుకు కేంద్ర రక్షణ శాఖను ఒప్పించి 153 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. దీనికి బదులుగా రక్షణ శాఖకు మరోచోట భూమిని కేటాయించింది. ముఖ్యంగా బేగంపేట ఎయిర్‌పోర్ట్ రన్‌వే కింద నుంచి అండర్ టన్నెల్ నిర్మించేందుకు అనుమతులు పొందడం ఒక చారిత్రాత్మక విజయమని సీఎం పేర్కొన్నారు. దీనివల్ల ప్రయాణ సమయం భారీగా తగ్గనుంది.

**నగరంలో కొత్త ఎలివేటెడ్ కారిడార్లు**

ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్న బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్ ప్రాంతాల నుంచి ఎయిర్‌పోర్ట్‌కు సులభంగా వెళ్లేందుకు కొత్త మార్గాలను పరిశీలిస్తున్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ రోడ్ నుంచి రాయదుర్గం నాలెడ్జ్ పార్క్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మించి, దానిని పీవీ ఎక్స్‌ప్రెస్‌వేకు అనుసంధానం చేయనున్నారు. అలాగే నల్గొండ చౌరస్తా వద్ద నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ ఈ ఏడాది జూన్ లేదా జూలై నాటికి అందుబాటులోకి రానుంది.

**మూసీ వెంట 43 కిలోమీటర్ల మేర ప్రయాణం**

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా నది వెంట భారీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నారు. హిమాయత్ సాగర్ జంక్షన్ నుంచి గౌరవెల్లి వరకు 43 కిలోమీటర్ల మేర సాగే ఈ కారిడార్‌పై పలు చోట్ల ట్రంపెట్లను ఏర్పాటు చేస్తారు. దీనివల్ల నగరంలోని ఒక మూల నుంచి మరో మూలకు ట్రాఫిక్ చిక్కులు లేకుండా వేగంగా వెళ్లే అవకాశం కలుగుతుంది. అంతేకాకుండా, నగరంలో పార్కింగ్ సమస్యను తీర్చడానికి కేబీఆర్ పార్క్, నాంపల్లి వంటి చోట్ల మల్టీ లెవల్ పార్కింగ్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది.

**పాదచారుల కోసం 'ఆపరేషన్ రోప్'**

నగరంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణ వల్ల పాదచారులు రోడ్లపైకి రావడం, తద్వారా ట్రాఫిక్ జామ్ అవ్వడంపై ప్రభుత్వం సీరియస్ అయింది. చిరు వ్యాపారులకు కొంత ఇబ్బంది కలిగినప్పటికీ, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా 'ఆపరేషన్ రోప్' ద్వారా ఆక్రమణలను తొలగిస్తున్నారు. అలాగే 360 కిలోమీటర్ల మేర విస్తరించి ఉండే రీజినల్ రింగ్ రోడ్డు (RRR)కు, ఓఆర్ఆర్ కు మధ్య రేడియల్ రోడ్ల నిర్మాణాన్ని కూడా వేగవంతం చేస్తున్నారు.

**విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలకు అండ**

అభివృద్ధి పనులతో పాటు మానవీయ కోణంలోనూ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ శాఖ ఉద్యోగులు ఓర్సు సురేష్, ముఖ్తార్ బేగ్ కుటుంబాలకు రూ. 1 కోటి చొప్పున ప్రమాద బీమా చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందజేశారు. కుటుంబ పెద్దను కోల్పోయిన ఆ కుటుంబాలు వీధిన పడకూడదనే ఉద్దేశంతో ఈ పరిహారాన్ని పెంచినట్లు తెలిపారు. అలాగే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

# బడ్జెట్ అంటే అంకెల గారడీయేనా?

మొదటిపేజీ తరువాయి

విపత్కర పరిస్థితుల్లో కూడా ఒక్క సీజన్ కూడా ఆపకుండా రైతుబంధు ఇచ్చామని, కానీ ఈ ప్రభుత్వం ఇప్పటికే మూడు సీజన్ల పెట్టుబడి సాయాన్ని రైతులకు ఎగ్గొట్టిందని ఆరోపించారు. కుడి చేత్తో రైతు బంధు నిధులను ఆపేసి, ఎడమ చేత్తో రుణమాఫీ చేశామని చెప్పడం రైతులను వంచించడమేనని ధ్వజమెత్తారు. కెసిఆర్ ది 'పెట్టుబడి సాయం' అయితే, రేవంత్ రెడ్డి ది కేవలం 'ఎన్నికల పెట్టుబడి సాయం' అని ఎద్దేవా చేశారు.

**కూలీలకు అన్యాయం.. బోనస్ లో 'బోగస్'**

భూమి లేని రైతు కూలీలకు ఏడాదికి రూ. 12 వేల చొప్పున 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' ఇస్తామని చెప్పి, రెండు బడ్జెట్లు గడిచినా ఒక్క రూపాయి కూడా ఎందుకు కేటాయించలేదని హరీష్ రావు ప్రశ్నించారు. ఇందిరా గాంధీ పేరు పెట్టుకుని పేద కూలీల కడుపు కొట్టడం ధర్మమేనా అని నిలదీశారు. వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామన్న హామీని కేవలం సన్న రకాలకే పరిమితం చేసి, మెజారిటీ రైతులను మోసం చేశారని విమర్శించారు. బడ్జెట్‌లో పంటల బీమా కోసం రూ. 1,300 కోట్లు కేటాయించినా, క్షేత్రస్థాయిలో ఒక్క రైతుకు కూడా దాని ప్రయోజనం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**మద్యం ఆదాయంపైనే కక్కుర్తి?**

రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకోవడానికి ప్రభుత్వం ఎంచుకున్న మార్గంపై హరీష్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది ఎక్సైజ్ ఆదాయాన్ని రూ. 34 వేల కోట్ల నుంచి రూ. 46 వేల కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకోవడంపై ఆయన మండిపడ్డారు. అంటే అదనంగా రూ. 12 వేల కోట్ల ఆదాయం రావాలంటే ఊరూరా బార్లు, గల్లీ గల్లీకి బెల్టు షాపులు ఓపెన్ చేస్తారా అని నిలదీశారు. ఆదాయం కోసం జనాన్ని తాగుబోతులుగా మార్చడమేనా మీ పద్ధతి అని ప్రశ్నించారు. దీనిపై ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందిస్తూ గత ప్రభుత్వం కూడా ఆదాయాన్ని పెంచిందని చెప్పగా, హరీష్ రావు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ తాను ఆర్థిక మంత్రిని ప్రశ్నలు అడుగుతున్నానని స్పష్టం చేశారు.

**నిరుద్యోగుల గోస..**
**మాయమైన జాబ్ క్యాలెండర్**


మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఏమైందని హరీష్ రావు నిలదీశారు. గత బడ్జెట్‌లో జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి, ఈ బడ్జెట్‌లో కనీసం ఆ ప్రస్తావనే లేకపోవడం నిరుద్యోగులను మోసం చేయడమేనని అన్నారు. ఉద్యోగాల కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న అశోక్ నగర్ అభ్యర్థులపై లాఠీచార్జీలు చేయడం ప్రభుత్వ అప్రజాస్వామిక పాలనకు నిదర్శనమని ఖండించారు. రాహుల్ గాంధీ మాటలు నమ్మి ఓటేసిన నిరుద్యోగులు నేడు రోడ్ల మీద లాఠీ దెబ్బలు తింటున్నారని, వారి పరిస్థితి వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేశారు.

**రుణమాఫీలో అసంపూర్తి లెక్కలు**

ప్రభుత్వం రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్నా, క్షేత్రస్థాయిలో వేలాది మంది రైతులు ఇప్పటికీ బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని హరీష్‌రావు గుర్తు చేశారు. రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన నిధులు, లబ్ధిదారుల సంఖ్యకు వాస్తవానికి పొంతన లేదని ఆరోపించారు. ప్రభుత్వం చెప్పే అంకెల గారడీ వల్ల రైతులు అయోమయంలో ఉన్నారని, వెంటనే అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**బడ్జెట్‌లో ప్యూరిటీ, షూరిటీ ఎక్కడ?**

ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎక్కడా స్పష్టత లేదని హరీష్ రావు విమర్శించారు. ఈ బడ్జెట్‌లో 'ప్యూరిటీ' (పరిశుద్ధత), 'క్లారిటీ' (స్పష్టత), 'షూరిటీ' (నమ్మకం) ఏమీ లేవని ఎద్దేవా చేశారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలంటే లక్షల కోట్లు అవసరమవుతాయని, కానీ బడ్జెట్‌లో దానికి సరిపడా కేటాయింపులు లేకపోవడం చూస్తుంటే ఈ ప్రభుత్వం కేవలం కాలయాపన చేస్తోందని అర్థమవుతోందని విమర్శించారు.



ప్రభుత్వం ఇప్పటికైనా అంకెల గారడీ పక్కన పెట్టి, రైతులకు బకాయి పడ్డ పెట్టుబడి సాయాన్ని విడుదల చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, రైతు కూలీలకు ఆత్మీయ భరోసా నిధులు విడుదల చేయాలని కోరారు. ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందని, ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడతామని ఆయన స్పష్టం చేశారు.

# పదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు?

మొదటిపేజీ తరువాయి

మండిపడ్డారు.

అప్పుల కుప్పపై సీతక్క ధ్వజం

బీఆర్ఎస్ హయాంలో చేసిన విచ్చలవిడి అప్పులు ప్రస్తుత ప్రభుత్వానికి గుదిబండగా మారాయని సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. "పాండవులు కష్టపడి సంపాదించింది అంతా కౌరవుల తద్దినానికే సరిపోయినట్లుగా ఉంది మా పరిస్థితి" అని ఆమె ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం చేసిన లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు కట్టడానికే ఇప్పుడు ప్రభుత్వ ఖజానాలోని నిధులు సరిపోతున్నాయని, ప్రజలకు ఇచ్చిన హామీలను ఆర్థిక వెసులుబాటును బట్టి ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని ఆమె స్పష్టం చేశారు.

**రుణమాఫీపై హరీష్‌కు ప్రశ్నల వర్షం**

హరీష్ రావు తన నియోజకవర్గంలో 50 శాతం మందికి కూడా రుణమాఫీ కాలేదని విమర్శించడాన్ని సీతక్క తప్పుబట్టారు. "హరీష్ అన్న.. మీరు పదేళ్లు అధికారంలో ఉన్నారు, ఫైనాన్స్ మినిస్టర్‌గా కూడా చేశారు. మరి మీ హయాంలోనే రుణమాఫీ ఎందుకు పూర్తి చేయలేదు? అప్పుడే చేసి ఉంటే ఇప్పుడు రైతులకు ఈ ఇబ్బంది ఉండేది కాదు కదా?" అని నిలదీశారు. ఏకకాలంలో లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని చెప్పి గత ప్రభుత్వం రైతులను మోసం చేసిందని, కానీ తమ ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి అడుగులు వేస్తోందని చెప్పారు.

**నిరుద్యోగుల అంశంపై నిలదీత**

అశోక్ నగర్ లాఠీచార్జీలు, నిరుద్యోగుల సమస్యలపై హరీష్ రావు చేసిన వ్యాఖ్యలకు సీతక్క గట్టి కౌంటర్ ఇచ్చారు. పదేళ్ల కాలంలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో లెక్క చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం నోటిఫికేషన్లు వేసి వదిలేయడం ఉద్యోగాలు ఇవ్వడం కాదని, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వేల సంఖ్యలో నియామక పత్రాలు అందజేసి నిరుద్యోగుల ఇళ్లలో వెలుగులు నింపామని గుర్తు చేశారు. ఉద్యోగాల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో నిరుద్యోగులను వంచించింది గత ప్రభుత్వమేనని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

**అధికారం పోయిందన్న బాధే అసలు కారణం**

హరీష్ రావు చేస్తున్న విమర్శల వెనుక ప్రజల పట్ల ప్రేమ లేదని, కేవలం అధికారం కోల్పోయిన బాధ మాత్రమే ఉందని సీతక్క వ్యాఖ్యానించారు. "సీటు మారినంత మాత్రాన చరిత్ర మారిపోదు. పదేళ్లు అంటే చాలా సమయం.. అప్పుడు చేయని పనులు ఇప్పుడు చేయలేదని మమ్మల్ని అడగడం ఏంటి?" అని ప్రశ్నించారు. ప్రజల కోసం తాము ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ జీవిత బీమా', ఐదు లక్షల ప్రమాద బీమా వంటి పథకాలను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షం బురద చల్లే రాజకీయం చేస్తోందని విమర్శించారు.

**గత పదేళ్ల లెక్కలు చెప్పండి**

రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నప్పుడు, నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నప్పుడు గత ప్రభుత్వం ఎక్కడ ఉందని సీతక్క ప్రశ్నించారు. తాము చేస్తున్న మంచి పనుల్లో మట్టి పోయడం మానుకోవాలని సూచించారు. "ముందు మీరు చేసిన పనుల లెక్క చెప్పండి.. ఆ తర్వాత మేము ఏం చేయాలో చెప్పండి" అని హరీష్ రావుకు సవాల్ విసిరారు. వడ్డీలకు వడ్డీలు కట్టాల్సి వస్తున్నా, సంక్షేమ పథకాలను ఆపకుండా ముందుకు తీసుకెళ్తున్నామని ధీమా వ్యక్తం చేశారు.

**ఇందిరమ్మ ఇళ్లు.. నిరుపేదల ఆశలు**

గత ప్రభుత్వం పదేళ్లలో ఎన్ని ఇళ్లు ఇచ్చిందో శ్వేతపత్రం విడుదల చేయాలని సీతక్క డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం ఈ రెండేళ్లలోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పెద్ద ఎత్తున చేపట్టి చూపిస్తుందని సవాల్ చేశారు. సన్నబియ్యం పంపిణీ ద్వారా పేదలకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నామని, ఈ అభివృద్ధిని అడ్డుకోవద్దని కోరారు. సీటు మారగానే నీతులు చెప్పడం మానుకుని, నిర్మాణాత్మకమైన సూచనలు చేయాలని హితవు పలికారు.



**ప్రజల పక్షాన నిలబడతాం**

చివరగా, ఎన్ని అడ్డంకులు ఎదురైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతుందని సీతక్క స్పష్టం చేశారు. అప్పుల బాధలు ఉన్నా, పేదవాడి సంక్షేమమే తమ ప్రథమ ప్రాధాన్యతని చెప్పారు. ప్రతి కుటుంబానికి భరోసా ఇచ్చేలా ప్రభుత్వం పనిచేస్తోందని, విమర్శలు పక్కన పెట్టి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ప్రతిపక్షాలను కోరారు.

# మహిళా రిజర్వేషన్ల అమలుకు కేంద్రం సిద్ధం

మొదటిపేజీ తరువాయి

రిజర్వేషన్‌ను వెంటనే అమలు చేయాలని నిర్ణయించింది. దీనికోసం పార్లమెంట్‌లో వచ్చే వారం ఒక సవరణ బిల్లు తీసుకొచ్చే అవకాశం ఉంది. ఈ కొత్త చట్టం దేశంలోని మహిళలందరికీ రాజకీయాల్లో బలమైన స్థానం కల్పిస్తుందని ఆశాభావాలు వ్యక్తమవుతున్నాయి.

**గత చట్టం అమలు ఎందుకు ఆలస్యమైంది?**

2013లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టం లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించాలని చెప్పింది. కానీ ఈ చట్టం అమలు కావాలంటే ముందు కొత్త జనాభా లెక్కలు తీసుకోవాలి. ఆ తర్వాత నియోజకవర్గాలను మళ్లీ విభజించాలి. ఈ ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు కాబట్టి చట్టం కాగితాల మీదే మిగిలిపోయింది. మహిళలు రాజకీయాల్లో ముందుకు రావాలని చాలా మంది ఆశించారు. కానీ ఈ ఆలస్యం వల్ల వారి ఆశలు నిరాశగా మారాయి. ఇప్పుడు కేంద్రం ఈ సమస్యను పరిష్కరించడానికి కొత్త ఆలోచన చేసింది. పునర్విభజన ఆగకుండానే 2011 జనాభా ఆధారంగా రిజర్వేషన్ అమలు చేయాలని ప్రతిపాదించింది. ఇది మహిళలకు పెద్ద ఉపకారం అవుతుంది.

**2011 జనాభా లెక్కలతో**
**కొత్త ప్రణాళిక ఎలా ఉంటుంది?**

కేంద్రం తాజా నిర్ణయం ప్రకారం ఇప్పుడు ఉన్న 543 లోక్‌సభ సీట్ల సంఖ్యను 816కి పెంచుతారు. ఈ కొత్త సీట్లలో 273 సీట్లు మహిళలకు ప్రత్యేకంగా రిజర్వ్ చేస్తారు. ఇది గత చట్టంలో చెప్పిన 33 శాతం రిజర్వేషన్‌కు సరిపోతుంది. ఇప్పటి వరకు కొత్త జనాభా లెక్కలు తీసుకోవాలని, ఆ తర్వాతే రిజర్వేషన్ అమలు చేయాలని చట్టం చెప్పింది. కానీ దేశంలో మారుతున్న పరిస్థితులు చూసి కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. 2011 జనాభా లెక్కలు ఇప్పటికీ చాలా సీట్ల విభజనకు ఉపయోగపడతాయి. ఇందుకోసం ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే ఒక బిల్లు ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మార్పు వల్ల మహిళలు ఎక్కువ సంఖ్యలో పార్లమెంట్‌కు వచ్చి తమ సమస్యలు పరిష్కరించగలరు. ఇది దేశ అభివృద్ధికి కూడా ఉపయోగపడుతుంది.

**లోక్‌సభ సీట్ల సంఖ్య పెరగడం వల్ల కలిగే ప్రయోజనాలు**

ప్రస్తుతం లోక్‌సభలో 543 సీట్లు ఉన్నాయి. కొత్త చట్టం అమలైతే ఇది 816కి పెరుగుతుంది. ఇందులో మహిళలకు 273 సీట్లు కేటాయించడం జరుగుతుంది. ఇది చాలా పెద్ద మార్పు. ఇప్పుడు ఉన్న సీట్లలో మహిళల సంఖ్య చాలా తక్కువ. కొత్త సీట్లు వచ్చిన తర్వాత మహిళలు ఎక్కువ మంది ఎన్నికై వస్తారు. దీంతో పార్లమెంట్‌లో మహిళల సమస్యలు, వారి అవసరాలు ఎక్కువగా చర్చకు వస్తాయి. ఉదాహరణకు విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి విషయాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయి. ఇంకా రాష్ట్రాల్లోని శాసనసభలకు కూడా ఈ రిజర్వేషన్ వర్తించాలి. దీని వల్ల దేశవ్యాప్తంగా మహిళల రాజకీయ భాగస్వామ్యం పెరుగుతుంది. కేంద్రం ఈ మార్పును త్వరగా అమలు చేయాలని భావిస్తోంది. ఇది దేశ చరిత్రలో ఒక మైలురాయి అవుతుంది.

**మహిళలకు 273 సీట్లు రిజర్వ్ చేయడం ఎంత ముఖ్యం?**

కొత్త చట్టం ప్రకారం మొత్తం 816 సీట్లలో 273 సీట్లు మహిళలకు మాత్రమే ఇవ్వాలి. ఇది గతంలో ఆమోదించిన 33 శాతం రిజర్వేషన్‌కు ఖచ్చితంగా సరిపోతుంది. ఇప్పుడు లోక్‌సభలో మహిళల సంఖ్య చాలా తక్కువగా ఉంది. కొత్త ఏర్పాటు వల్ల వారు ఎక్కువ సంఖ్యలో వచ్చి తమ అభిప్రాయాలు వ్యక్తం చేయగలరు. మహిళలు రాజకీయాల్లో ఎక్కువ పాల్గొనాలంటే ఇలాంటి రిజర్వేషన్ చాలా అవసరం. ఇది వారికి ఆత్మవిశ్వాసం కలిగిస్తుంది. ఇంకా గ్రామాలు, పట్టణాల్లోని సమస్యలు పార్లమెంట్‌లో చర్చకు వస్తాయి. కేంద్రం ఈ రిజర్వేషన్‌ను ముందుగానే అమలు చేయడం వల్ల మహిళలు త్వరగా లాభపడతారు. ఇది దేశంలో సమానత్వం కోసం ఒక చక్కని అడుగు.


**రాజ్యాంగ సవరణ ఎందుకు అవసరం అవుతోంది?**

గత చట్టంలో సెక్షన్ 5 ప్రకారం పునర్విభజన పూర్తి అయిన తర్వాతే రిజర్వేషన్ అమలు చేయాలి. కానీ ఇప్పుడు దానికి ముందే అమలు చేయాలంటే రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుంది. కేంద్రం ఈ సవరణ బిల్లును తీసుకొస్తోంది. ఇది ఆర్టికల్ 368(2) ప్రకారం ఉభయ సభల్లో మెజారిటీ మరియు హాజరైన వారిలో మూడింట రెండు వంతుల ఆమోదం కావాలి. ఇది సాధారణ బిల్లు కాదు, రాజ్యాంగ సవరణ కాబట్టి ఈ నియమాలు తప్పనిసరి. కాబట్టి కేంద్రం ఈ సవరణను జాగ్రత్తగా తీసుకొస్తోంది. ఇది అమలైతే మహిళల రిజర్వేషన్ వెంటనే అమలులోకి వస్తుంది. ఇలాంటి సవరణలు దేశ అభివృద్ధికి సహాయపడతాయి.

**బీజేపీకి ప్రతిపక్షాల మద్దతు ఎందుకు కావాలి?**

లోక్‌సభలో బీజేపీకి 240 ఎంపీలు, రాజ్యసభలో 103 మంది మాత్రమే ఉన్నారు. రాజ్యాంగ సవరణకు ఒక్క సభలోనూ మెజారిటీ లేదు. కాబట్టి ప్రతిపక్షాల మద్దతు తప్పనిసరి. ఇది కాంగ్రెస్, ఇతర పార్టీలతో చర్చలు చేయాల్సిన అవసరం ఉంది. కేంద్రం ఈ విషయంలో అన్ని పార్టీలను ఒప్పించాలని ప్రయత్నం చేస్తోంది. ఈ సవరణ అమలైతే మహిళలకు మేలు జరుగుతుంది కాబట్టి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి. ఇది దేశ ప్రజలందరి హక్కు సంబంధిత విషయం.

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కేంద్రానికి ఒక ముఖ్యమైన లేఖ రాశారు. మహిళా రిజర్వేషన్ చట్టం అమలు విధానాలు, కార్యాచరణ ప్రణాళికపై అన్ని పార్టీలతో చర్చించాలని అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశం ద్వారా అన్ని సందేహాలు తీర్చి ఒక ఏకాభిప్రాయం తీసుకోవచ్చు. ఖర్గే గారి ఈ



విజ్ఞప్తి చాలా ముఖ్యం. ఎందుకంటే రాజ్యాంగ సవరణకు అన్ని పార్టీల మద్దతు కావాలి. ఇది మహిళల హక్కుల కోసం జరిగే చర్చ అని ఆయన అన్నారు. కేంద్రం ఈ సమావేశాన్ని త్వరగా నిర్వహించాలని ఆశిస్తున్నారు.

**కొత్త చట్టం అమలు తర్వాత ఏమవుతుంది?**

ఈ చట్టం అమలైతే లోక్‌సభలో మహిళల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. రాష్ట్ర శాసనసభల్లో కూడా 33 శాతం రిజర్వేషన్ వర్తించాలి. ఇది గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు మహిళలు రాజకీయాల్లో చురుకుగా పాల్గొనడానికి దోహదపడుతుంది. ఇప్పుడు మహిళలు ఎన్నికల్లో పోటీ పడినా గెలుపు అవకాశాలు తక్కువ. కానీ రిజర్వేషన్ వల్ల వారికి సీట్లు ఖచ్చితంగా వస్తాయి. దీంతో వారు తమ గ్రామాలు, ప్రాంతాల సమస్యలు పార్లమెంట్‌లో లేవనెత్తగలరు. ఉదాహరణకు మహిళల విద్య, ఆరోగ్యం, ఉద్యోగాలు, భద్రత వంటి విషయాల్లో కొత్త చట్టాలు రావచ్చు. ఇది దేశ సమాజాన్ని మార్చేస్తుంది.

**ఈ మార్పు రాజకీయ పార్టీలపై ఎలాంటి ప్రభావం చూపుతుంది?**

ప్రతి పార్టీలు ఇప్పుడు మహిళలకు టిక్కెట్లు ఇవ్వడంలో ఎక్కువ శ్రద్ధ చూపించాలి. బీజేపీ, కాంగ్రెస్, ఇతర ప్రాంతీయ పార్టీలు మహిళల నాయకులను పెంచాలి. ఇది పార్టీల లోపల కొత్త నాయకత్వం ఏర్పడడానికి సహాయపడుతుంది. ఇంకా ఎన్నికల సమయంలో మహిళల ఓట్లు ఎక్కువగా వస్తాయి. ప్రజలు మహిళల నాయకత్వాన్ని ఆమోదిస్తారు. ఇది దేశ రాజకీయాలను మరింత బలంగా చేస్తుంది. కానీ కొత్త సీట్ల విభజనలో కొన్ని రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు వచ్చే అవకాశం ఉంది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు ఎక్కువ ప్రయోజనం పొందవచ్చు. ఇలాంటి మార్పులు దేశ సమతుల్యాన్ని కాపాడాలి.

# దానం నాగేందర్ కు హైకోర్టు నోటీసులు.!

మొదటిపేజీ తరువాయి

వేసింది. బీజేపీ ఎమ్మెల్యే నేత మహేశ్వర్ రెడ్డి దానం నాగేందర్‌పై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచిన నాగేందర్, తరువాత కాంగ్రెస్‌లో చేరడం రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ తరఫు వాదనలు వినిపించాయి. వెంటనే ఆయనపై అనర్హత వేటు వేయాలని కోర్టును కోరారు.

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, దానం నాగేందర్ పార్టీ మారలేదని.. ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నారని ముందుగా తీర్పు ఇచ్చారు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ మహేశ్వర్ రెడ్డి కోర్టును ఆశ్రయించారు. విచారణలో భాగంగా, స్పీకర్ తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి, ఫిరాయింపుల అంశంపై గతంలో సుప్రీం కోర్ట్ ఇచ్చిన తీర్పులను కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. మరోవైపు పిటిషనర్



తరఫు న్యాయవాది, ఎంపీగా కాంగ్రెస్ నుంచి పోటీ చేయడం స్పష్టమైన ఫిరాయింపేనని వాదించారు. ఈ నేపథ్యంలో హైకోర్టు దానం నాగేందర్‌కు నోటీసులు జారీ చేసింది.

# ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కోరుతూ బీఆర్ఎస్ ప్రైవేట్ మెంబర్ బిల్లు

మొదటిపేజీ తరువాయి

వెల్లడించారు.

అత్యంత కీలకమైన ఈ బిల్లును ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రవేశపెట్టడానికి అనుమతించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. స్పీకర్‌తో పాటు అసెంబ్లీ సెక్రటరీకి కూడా బిల్లుకు సంబంధించిన నోటీసులు అందజేశారు.

కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు జగదీష్‌రెడ్డి, మల్లారెడ్డి, కేపీ వివేకానందా, సుధీర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, చింతా ప్రభాకర్, అనిల్ జాదవ్, మానిక్‌రావు, దాసోజ్ శ్రవణ్‌కుమార్ , శంభీపూర్ రాజు, మాదవరం కృష్ణారావు, కల్వకుంట్ల సంజయ్, కౌశిక్ రెడ్డి తదితరులున్నారు.



# అచ్చంపేట గురుకుల పాఠశాలలో వంటగ్యాస్ సమస్యలను పరిష్కరించాలి

- అచ్చంపేట గురుకుల పాఠశాలలో వంటగ్యాస్ సమస్యలను పరిష్కరించాలి
- (ఏఐయస్బి) జిల్లా అధ్యక్షులు బైరాపూర్ రవీందర్ గౌడ్ డిమాండ్

**నిజాంసాగర్, మర్చి 23(డిడి9 వార్త):**



అచ్చంపేట గ్రామంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో నెలకొన్న వంటగ్యాస్ సమస్యను అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని తక్షణమే పరిష్కరించాలని (ఏఐయస్బి) ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు బైరాపూర్ రవీందర్ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత వారం రోజులుగా పాఠశాలకు వంటగ్యాస్ సరఫరా లేకపోవడంతో విద్యార్థుల మెనూ గాడి తప్పిందన్నారు. గతంలో ఈ పాఠశాల జుక్కల్ మండల కేంద్రంలో ఉండేదని, అక్కడ వసతులు సరిగా లేకపోవడంతో అచ్చంపేటకు మార్పిడి చేసినట్లు గుర్తు చేశారు.గత ఐదేళ్లుగా ఇండెన్ గ్యాస్ స్థానంలో హెచ్‌పి గ్యాస్ సరఫరా చేస్తున్న నిజాంసాగర్‌లోని వీరభద్ర ఏజెన్సీ నిర్వాహకుడు ప్రస్తుతం సరఫరా చేయలేనని చెప్పడంతో సమస్య తలెత్తిందన్నారు. ఈనెల 18న ఏజెన్సీ మార్పిడి పత్రం తీసుకువచ్చినప్పటికీ, నిర్వాహకుడు దానిని అంగీకరించకపోవడంతో సమస్య మరింత క్లిష్టంగా మారిందని పాఠశాల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఇండెన్ గ్యాస్ లేకపోవడం, హెచ్‌పి గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అర్ధాకలితో అలమటిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత వారం రోజులుగా సమస్య కొనసాగుతున్నప్పటికీ, పత్రికల్లో వార్తలు వచ్చినా ఉన్నతాధికారులు స్పందించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు.రెండు రోజుల్లో గ్యాస్ కంపెనీలతో మాట్లాడి సమస్యను పరిష్కరించకపోతే, పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, దళితబహుజన సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# ఆర్ అండ్ బి మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డికి కలిసి వినతి పత్రం ఇచ్చిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్.



- నియోజకవర్గంలోని ప్రధానమైన రోడ్లను మంజూరు చేయాలని విజ్ఞపి.
- స్పందించి మంజూరుకై ఆదేశాలు ఈ &సికి జారీ చేసిన మంత్రి.

**ఆదిలాబాద్,మార్చి 23**



హైదరాబాద్లో ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం మర్యాద పూర్వకంగాకలిశారు. ఈసందర్భంగా ఆయన బోథ్ నియోజకవర్గంలో గల ప్రధానమైన రోడ్లను మంజూరు చేయాలని ఒక వినతిపత్రం అందజేశారు. బోథ్ పట్టణంలో బీటీ రోడ్డు &సీసీ రింగ్ రోడ్డు & లైటింగ్ నిర్మాణానికి రూపాయలు. 5 కోట్లు. పొచ్చర ఎక్స్ రోడ్డు నుంచి బోథ్ పట్టణం వరకు ఫోర్ లైన్ తో పాటు సెంట్రల్ లైటింగ్ ఒక మైనర్ బ్రిడ్జి నిర్మాణానికి రూపాయలు 38 కోట్లు. ఇచ్చొడ మండల కేంద్రంలో ఫోర్ లైన్ నిర్మాణంలో భాగంగా సైడ్ డ్రైన్ నిర్మాణానికిరూపాయలు.2 కోట్లు. మంజూరు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరగా స్పందించిన మంత్రి అనిల్ నీ మాట కాదనను అని తక్షణమే నిధులు మంజూరు చేయాలని ఈ అండ్ సికి ఆదేశాలు జారీచేశారు.

# గొర్రెలు, మేకలకు గాలికుంట టీకాలు

**డిడి9 వార్త గుడిహత్నూర్**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్నత గాలికుంట నివారణ టీకాల కార్యక్రమంలో భాగంగా అదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని జవహర్‌నగర్ గ్రామంలో గొర్రెలు, మేకలకు గాలికుంట నివారణ టీకాలు వేశారు . ఈ కార్యక్రమాన్ని జిల్లా పశువైద్య అధికారి డా. రామారావు పర్యవేక్షించారు.ఈ సందర్భంగా పశువైద్య అధికారులు మాట్లాడుతూ, పశువుల్లో వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తగా టీకాలు వేయడం ఎంతో అవసరమని తెలిపారు. రైతులు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకుని తమ పశువులను రక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, పశువైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.



# అడవులను కాపాడితేనే దేశం సుస్థిరంగా ఉంటుంది

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర

**కామారెడ్డి, మర్చి 23(డిడి9 వార్త):**



అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ అటవీ దినోత్సవం, పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర హాజరై కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమానికి ముందు అటవీ శాఖ కార్యాలయం నుండి డిగ్రీ కళాశాల వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో అధికారులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణ పరిరక్షణపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, “మొక్కలు నాటడం ద్వారా పచ్చదనం పెంపొందించవచ్చు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్క నాటి దాన్ని సంరక్షించాలి. ప్రతి పుట్టినరోజున ఒక మొక్క నాటడం అలవాటు చేసుకోవాలి” అని సూచించారు. “అటవీ సంరక్షణే దేశ సంరక్షణ” అనే నినాదంతో ప్రజల్లో అవగాహన పెంపొందించాలని పిలుపునిచ్చారు. అలాగే పిచ్చుకల సంరక్షణపై దృష్టి సారించాలని, ఇంటి వద్ద నీటి గిన్నెలు ఉంచడం, చిన్న గూళ్లు ఏర్పాటు చేయడం వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ, “ప్రాణవాయువు లేకుండా మానవ జీవనం సాధ్యం కాదు. చెట్లు, అడవులు మన జీవనాధారాలు. ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలు తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది” అని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి దాన్ని సంరక్షించాలని, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో ముందుండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారిణి నిఖిత, ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ తదితర అధికారులు పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ మద్దతు తెలిపారు. పోలీస్, అటవీ శాఖ అధికారులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.సమావేశంలో సారధి కళాకారులు “చెట్టూ చెట్టమ్మను నేను… చెట్టును నేనురా… మనిషి మనుగడకు జీవం పోసే అమ్మ” వంటి గీతాలతో కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం అటవీ సంరక్షణపై పోస్టర్‌ను ఆవిష్కరించారు.










## ప్రజావాణిలో 96 దరఖాస్తులు స్వీకరణ

# జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి, మర్చి 23(డిడి9 వార్త):**జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ వివిధ సమస్యలపై వచ్చిన 96 అర్జీలను అర్జీదారుల నుంచి స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన అర్జీలను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏసిఎల్బి మధుమోహన్, సీఈఓ చందర్, ఆర్డీవో వీణ, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత షుగర్ పరీక్షలు

**బీర్కూర్, మర్చి 23(డిడి9 వార్త):**

బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం లయన్స్ భవనంలో ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 26 మందికి పరీక్షలు నిర్వహించారు.పరీక్షలలో భాగంగా 6 మందిలో షుగర్ స్థాయిలు అధికంగా ఉండడంతో వారికి ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు సితలే రమేష్, ల్యాబ్ టెక్నీషియన్ నారము ప్రవీణ్, లయన్ సభ్యులు సుధాకర్ రెడ్డి మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజావాణికి ఓకే ఒక దరఖాస్తు వచ్చింది.

బజార్హత్నూర్, మార్చి 23(డిడి 9వార్త ): బజార్హత్నూర్ ప్రజావాణి సోమవారం రోజు ఎంపీడీఓ కార్యాలయ భవనంలో జరిగింది.ఈ రోజు రెవిన్యూడిపార్ట్మెంట్ కు సంబందించిన ఒక ధరఖాస్తు మాత్రమే వచ్చిందని అధికారులు తెలిపారు.ఈ ప్రజావాణికి మండల తహసీల్దార్ శ్యామ్ సుందర్, మండల అభివృద్ధి అధికారి కే. శ్రీనివాస్,వ్యవసాయ శాఖ అధికారి మహ్మద్ సౌద్, మరో అధికారి హాజరయ్యారు.




# కాంగ్రెస్ పార్టీ తోనే బోథ్ నియోజకవర్గ అభివృద్ధి సాధ్యం.షేక్ షాకీర్ వార్డు సభ్యుడు.

**ఆదిలాబాద్ జిల్లా బోథ్, మార్చ్ 23(డి డి 9):-**

బోథ్ మండల ప్రజల దీర్ఘకాలిక అవసరమైన *ఫైర్ స్టేషన్‌ను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేయడము ప్రజాపాలనకు, పారదర్శక పాలనకు నిలువుటద్దం. ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించేందుకు అత్యవసరమైన ఈ సదుపాయం ఇప్పటికైనా అందుబాటులోకి రావడం పట్ల బోథ్ మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే, గతంలో అధికారంలో ఉన్న బి.ఆర్.ఎస్ ప్రభుత్వం ఈ కీలక అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం.తీవ్రంగా ఖండించదగిన విషయం. ఫైర్ స్టేషన్ కోసం ప్రజలు, ప్రజాప్రతినిధులు చేసిన న్యాయమైన డిమాండ్లకు స్పందించకుండా, ఉద్యమాలు చేసిన వారిపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. అధికార మదంతో ప్రజల స్వరాన్ని అణగదొక్కే ప్రయత్నం చేయడం అప్పటి ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన గత బి. ఆర్.ఎస్ బాధ్యత లేమి ప్రభుత్వం, వాటిని పట్టించుకోకుండా నిరసనలు అణచివేయడం ద్వారా ప్రజల నమ్మకాన్ని కోల్పోయింది. బోథ్ మండల ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, అగ్నిప్రమాదాల సమయంలో ఎదురైన ప్రమాదాలు—— all these reflect the failure of the previous administration. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అవసరాలను గుర్తించి, సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేయడం అభినందనీయం. ఇది కేవలం ఒక ఫైర్ స్టేషన్ మంజూరు మాత్రమే కాకుండా, ప్రజాస్వామ్య విలువలకు ఇచ్చిన గౌరవం కూడా. ఇకపై కూడా బోథ్ నియోజకవర్గ అభివృద్ధి కేవలము ప్రజాపాలన తోనే సాధ్యం.





## ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా నీటి సంరక్షణ ప్రతిజ్ఞ

- **జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

**కామారెడ్డి, మర్చి 23(డిడి9 వార్త):**

ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు "నీటి ప్రతిజ్ఞ" చేశారు.ఈ సందర్భంగా ప్రతిజ్ఞలో భాగంగా ప్రతి ఒక్కరూ నీటిని సంరక్షించేందుకు, పొదుపుగా వినియోగించేందుకు కట్టుబడి ఉండాలని సంకల్పించారు. ఒక్క బొట్టు నీరు కూడా వృథా కాకుండా చూసుకోవాలని, తమ కుటుంబ సభ్యులు కూడా నీటిని జాగ్రత్తగా వినియోగించేలా చైతన్యం కల్పించాలని ప్రతిజ్ఞ చేశారు.అలాగే నీటిని అత్యంత విలువైన సహజ వనరుగా భావిస్తూ, భవిష్యత్ తరాల కోసం దానిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, నీటి పరిరక్షణ ఎంత ముఖ్యమో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. భూమి, భవిష్యత్ తరాల కోసం నీటిని కాపాడుకోవడం అత్యవసరమని, ప్రతి ఒక్కరూ నీటి వినియోగంలో జాగ్రత్త పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏసిఎల్బి మధుమోహన్, సీఈఓ చందర్, ఆర్డీవో వీణ, భూగర్భ జల శాఖ అధికారి సతీష్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## బడ్జెట్‌లో బీసీలకు న్యాయం ఎక్కడ...?

- **టీఆర్పీ నాయకుడు గాండ్ల సుధీర్ కుమార్ ప్రశ్న**

**బాన్సువాడ, మర్చి 23(డిడి9 వార్త):**




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్ లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) బాన్సువాడ నియోజకవర్గం ఇంచార్జి గాండ్ల సుధీర్ కుమార్ విమర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోలేకపోయిందన్నారు. ముఖ్యంగా కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు ప్రతి సంవత్సరం ₹20,000 కోట్లు కేటాయిస్తామని ప్రకటించి, ప్రస్తుతం కేవలం ₹12,000 కోట్లకే పరిమితం కావడం దారుణమని అన్నారు.అదేవిధంగా బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేస్తామని చెప్పి ఇప్పటివరకు అమలు చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్రంలో సుమారు 60 శాతం జనాభా ఉన్న బీసీలకు బడ్జెట్ లో కేవలం 6 శాతం నిధులు మాత్రమే కేటాయించారని, మరోవైపు 10 శాతం కూడా లేని వర్గాలకు అధిక శాతం నిధులు కేటాయించడం సామాజిక న్యాయం కాదని ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి బీసీ వర్గాలకు తగిన న్యాయం చేయాలని గాండ్ల సుధీర్ కుమార్ డిమాండ్ చేశారు.

## ప్రభుత్వం కార్యక్రమంలపై చాహకటి కళాజాత బృందం విశ్రుత ప్రచారం,అవగాహన.

**బజార్హత్నూర్, మార్చి 23(డిడి9వార్త ):-**

ఆదిలాబాద్ జిల్లా బజార్హత్నూర్ మండలం లోని అనంతపూర్ గ్రామంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధ్వర్యంలో "తెలంగాణ సాంస్కృతిక సారథి " ఆదిలాబాద్ జిల్లా కళాకారుల బృందం వారు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమంలను సోమవారం రోజు కళాజాత ద్వారా ప్రచారం చేశారు. వేసవిలోజాగ్రత్తలు,నీటివిలువ,డ్రగ్స్ నిర్మూలన,ఆరు గ్యారంటీల పట్ల అవగాహనా కల్పించివిస్తృతంగా ప్రచారం చేస్తూ చైతన్య పరిచారు.ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ సీడాం హీరాబాయి పర్యవేక్షణ చేసి కళాకారులకు ధ్రువీకర పత్రాన్నిఅందించారు.ఈ కార్యక్రమంలో కళాకారులు చాహకటి రవీందర్ టీం గుంజాల రమేష్,ఆత్రం గోవింద్ రావ్, గట్టు వెంకట్ రావ్, మెస్రం మురళి, మామిడిపల్లి రాజలింగు, రాథోడ్ శంకర్, కుమ్ర నగేష్,గోడం ఆశీష్, ఎల్మల నర్సమ్మ,కొడప దుర్పతాబాయి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




ధృవీకరణ పత్రం





# షహీద్ దివాస్ సందర్భంగా పాదయాత్ర నిర్వహణ

- **మేరా యువ భారత్ ఆధ్వర్యంలో కార్యక్రమం**

**బాన్సువాడ, మర్చి 23(డిడి9 వార్త):**

మేరా యువ భారత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో సోమవారం షహీద్ దివాస్ సందర్భంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నసురుల్లాబాద్ ఎస్సై రాఘవేంద్ర, కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ ప్రాణుతి, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సునీల్ రాథోడ్ ప్రారంభించారు.విద్యార్థులు నర్సింగ్ కళాశాల నుండి దేశాయిపేట చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ ప్రాణుతి మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్య పోరాటాన్ని ఉద్రిక్తం చేయడంలో భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్ గురు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. వారి నిస్వార్థ దేశభక్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్ఎస్ఎన్ఆర్‌కే కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గంగాధర్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం అతి పిన్న వయస్సులోనే ప్రాణత్యాగం చేసిన మహనీయుల్లో భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్ గురు ముందు వరుసలో నిలుస్తారని అన్నారు. 1931 మార్చి 23న వారు ఉరితీయబడినా, వారి త్యాగాన్ని దేశం ఎప్పటికీ మరవదన్నారు.జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సునీల్ రాథోడ్ మాట్లాడుతూ, సమాజంలో అన్యాయం పెరిగినప్పుడు ప్రజా పోరాటం అవసరమవుతుందని, స్వాతంత్ర్యం కోసం ఎన్నో త్యాగాలు చేసిన అమరవీరులను షహీద్ దివాస్ సందర్భంగా స్మరించుకోవడం మన బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ ఎస్సై తాజుద్దీన్, కృష్ణ, నర్సింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లీలావతి, స్వర్ణలత, శాంతి, జయసుధ తదితరులు పాల్గొన్నారు.












## పీడీఎస్యూ(ఎస్)ఆధ్వర్యంలో భగత్ సింగ్ 95వ వర్ధంతి ఘనంగా నిర్వహణ

**బీర్కూర్, మర్చి 23(డిడి9 వార్త):**

ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్యూ) ఆధ్వర్యంలో స్థానిక బీర్కూర్ మండల కేంద్రంలోని భగత్ సింగ్ చౌరస్తాలో 95వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కొవ్వొత్తులు వెలిగించి, అమరవీరులకు నివాళులు అర్పించబడింది.ఈ సందర్భంగా పీడీఎస్యూ(ఎస్) జిల్లా అధ్యక్షుడు యన్. బాల్ రాజ్, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు మియాపూరం శశికాంత్ మాట్లాడుతూ, భరత స్వాతంత్ర్య కోసం ప్రాణాలకు సైతం లెక్క చేయకుండా బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల అమరత్వాన్ని గుర్తుచేసి, నేటి యువత ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. అలాగే, దేశంలో జరుగుతున్న అన్యాయాలపై పోరాడడానికి, సమాజ పరిరక్షణ కోసం పోరాటంలో ముందుండాల్సిన బాధ్యతను వాచి చెప్పారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు మియాపూరం శశికాంత్, టిపిపిసీ జిల్లా అధ్యక్షుడు మావురం శ్రీకాంత్, పీడీఎస్యూ (ఎస్) నాయకులు సాయి, శేఖర్, సాయి కుమార్, గ్రామ నాయకులు యమ రాములు, కోరిమె రఘు, పృథ్వీ, బాలకృష్ణ, సంబపూర్ రవి కుమార్, బోగాడామిది సాయిలు, మానేపురం సాయికుమార్, కుతడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సామ్రాజ్యవాద వ్యతిరేకతే నిజమైన దేశభక్తి

**బోధన్, నిజామాబాద్ జిల్లా 23మార్చి(డీడీ9 వార్త) :**



బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగిన జాతీయ ఉద్యమంలో ప్రాణాలర్పించిన వీర కిశోరాలు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగాలు వెలకట్టలేనివని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా పార్టీ బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి.మల్లేష్ పేర్కొన్నారు. సోమవారం భగత్ సింగ్ 95వ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆ విప్లవ వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... తెల్లదొరలు దేశం విడిచి వెళ్లడమే కాదు, ఇక్కడి కష్టజీవుల సంపద శ్రామికులకే దక్కాలన్నదే భగత్ సింగ్ ఆశయమని గుర్తు చేశారు. సామ్రాజ్యవాదాన్ని ఎదిరించడమే నిజమైన దేశభక్తి అని ఆయన స్పష్టం చేశారు. నేటి పాలకులు ప్రజల శ్రమను స్వదేశీ, విదేశీ కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తూ, కులమతాల పేరుతో ప్రజలను విభజిస్తున్నారని మల్లేష్ విమర్శించారు. అణచివేతకు వ్యతిరేకంగా భగత్ సింగ్ స్ఫూర్తితో యువత, కార్మికులు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి పడాల శంకర్, నాయకులు ఎండి ఇర్షద్, బాబుమియా, టి. లాలు, ఎస్.కె మీరా, ముస్తఫా, ఏఐయూకేఎంఎస్ ప్రతినిధులు బోయిడి శంకర్, డి. నాగేశ్వర్, మల్లారం రవి, శ్యామ్, గుళ్ళు సలీం తదితరులు పాల్గొన్నారు.

## బోథ్ ఎమ్మెల్యే అనిల్ యాదవ్ కృషితోనే ఫైర్ ఇంజన్.

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మార్చ్ 23(డి డి 9):-**

బోథ్ కు ఫైర్ ఇంజన్ మంజూరు కావడంలో ముమ్మాటికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కృషియే కారణం .... కానీ కాంగ్రెస్ పార్టీ వల్లే వచ్చిందని అబద్ధాలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా పిలవబడే ఆడే గజేందర్ పై బిఆరెస్ నాయకుడు బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ తీవ్ర విమర్శలు చేశారు.... ఖబర్దార్ గజేందర్ అబద్ధాల కంటూ ఒక హద్దు ఉంటుంది...

సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

అబద్ధాలు చెప్పి పబ్బం గడుపుకోవడంలో కాంగ్రెస్ పార్టీకె చెల్లిందని అన్నారు. పలుమార్లు రాష్ట్ర అసెంబ్లీలో బోథ్ సమస్యలను గౌరవ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అసెంబ్లీలో ప్రస్తావించడం కాంగ్రెస్ నాయకులకు కనబడలేదా అని ప్రశ్నించారు... సంబంధిత మంత్రులతో పాటు ముఖ్యమంత్రి దృష్టికి నియోజకవర్గ సమస్యలను తీసుకెళ్లడంతోనే బోథ్ కు ఫైర్ స్టేషన్ మంజూరు అయ్యిందని అన్నారు...

అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన మీకు బి.ఆర్.ఎస్ ను ఎమ్మెల్యేను విమర్శించే నైతిక అర్హత లేదని అన్నారు... మూడు విడుతలుగా రైతు భరోసా దాదాపు 24 వేల కోట్లు రైతుల డబ్బులు ఎగ్గొట్టిన ఘనత మీది... పింఛన్ల పెంపుదల ఊసే లేదు...కౌలు రైతులకు ఇస్తానన్న 12000 లేవు... 6 గ్యారంటీల అమలు గాలికి వదిలేసారు... మీరా మాకు చెప్పేది అని విమర్శించారు.

గౌరవ ఎమ్మెల్యేకు మంచి పేరు వస్తుందని అక్కసుతో అబద్ధపు ప్రచారాలు చేయడం సిగ్గుచేటు అన్నారు....

మీకు దమ్ముంటే మీ మంత్రులు, ముఖ్యమంత్రి తో మాట్లాడి బోథ్ రెవిన్యూ డివిజన్ తెప్పించాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, మినీ స్టేడియం మంజూరు చేయించాలని డీఎస్పీ ఆఫీస్ ఏర్పాటు చేయించాలని డిమాండ్ చేశారు.... మీకు పనులు చేయడం చేతకాదు కానీ ఒకరు చేసిన పనులు మేము చేసాము అని చెప్పుకోవడం మాత్రం బాగా వచ్చు అని విమర్శించారు...

ఎమ్మెల్యే లెటర్ లేనిదే నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ఆమోదం లభించదనే కనీస కామన్ సెన్స్ లేని వీరు నాయకులా అని ప్రశ్నించారు... ఇకనైనా అబద్ధపు ప్రచారాలు మానుకోండి గ్రామాల్లోకి వెళితే ప్రజలు తరిమికొట్టే రోజులు వచ్చాయి... వచ్చే జెడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికలలో జరిగేది అదే అని జోస్యం చెప్పారు....

గత ఎన్నికలలో మా బిఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ 76,000 పై చిలుకు మెజారిటీతో విజయ దుందిబ మోగిస్తే ప్రత్యర్థిగా ఉన్న ఆడె గజేందర్ ... నీకు వచ్చిన ఓట్లు ఎన్ని జస్ట్ 32,000 వేలే .....ఆ విషయం మరిచి పోయావా... అని ప్రశ్నించారు... ఆల్రెడీ నిన్ను ప్రజలు తిరస్కరించారని మళ్లీ అబద్ధపు ప్రచారాలు చేస్తే వచ్చేసారి ఆ మాత్రం ఓట్లు కూడా రావని హెచ్చరించారు....

ఇకనైనా కాంగ్రెస్ నాయకులు బుద్ధి తెచ్చుకొని నిజాలు మాట్లాడాలన్నారు... బోథ్ నియోజకవర్గ అభివృద్ధి కేవలం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ద్వారానే జరుగుతుందని అది ఫైర్ ఇంజన్ ఏర్పాటుతో మరొకసారి రుజువైందని అన్నారు. రాబోవు రోజుల్లో బోథ్ సమస్యల పట్ల అలుపెరుగని పోరాటం చేస్తామని అభివృద్ధి సాధించింతవరకు విశ్రమించేది లేదు అని అన్నారు.... ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఓరుగంటి స్వామి, మాజీ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, కన్వీనర్ నారాయణ రెడ్డి, పట్టణ అధ్యక్షులు అల్లకొండ ప్రశాంత్ ,బోథ్ మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, రూప్చంద్,విడిసి చైర్మన్ పోతన్న, గంగమల్లు, రవీందర్,సంజీవ్,రమణ గౌడ్, సోమేష్, రఫీ, రాజు,రమణ, ఇఫ్తేకర్, సురేందర్ యాదవ్ బీ ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



# భక్తిపారవశ్యంలో తడపాకల్ గోదావరి తీరం

**నిజామాబాద్ జిల్లా 23మార్చి(డీడీ9 వార్త) :**

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందని, ప్రతి మానవుడిలోనూ దైవత్వం అంతర్లీనంగా ఉంటుందని నిర్గుణ తత్వ మహారాజ్ ఉద్బోధించారు. ఏర్గట్ల మండలంలోని తడపాకల్ గోదావరి నదీ తీరాన వెలసిన శ్రీ దత్త సాయిబాబా మందిర ఐదవ వార్షికోత్సవ వేడుకలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక విజ్ఞాన మహాసభల్లో ఆయన ప్రసంగిస్తూ.. అజ్ఞానాన్ని, భ్రమలను వీడి ఆత్మజ్ఞానాన్ని పొందినప్పుడే మనిషి దైవస్వరూపుడవుతాడని పేర్కొన్నారు. నిత్య జీవితంలో సత్కర్మలు ఆచరిస్తూ కష్టాల్లో ఉన్న తోటివారికి సహాయపడేవారే నిజమైన మాధవులని ఆయన వివరించారు. అంతకుముందు బ్రహ్మ ముహూర్త కాలంలో పీచర ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీ విశ్వేశ్వరానందగిరి స్వామి వారి మేల్కొలుపు గానామృతంతో కార్యక్రమం భక్తిభావంతో మొదలైంది. అనంతరం భక్తులు, శిష్యులు సామూహికంగా భజన కీర్తనలు పాడుతూ.. నృత్యాలు చేస్తూ గోదావరి నదికి చేరుకున్నారు. అక్కడ శివాలయానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నదీ మాతకు మంగళ హారతులు ఇచ్చారు. ఈ మహాసభల్లో వక్తలు శ్రీధరానంద భారతి స్వామి, వేద పునీతానంద భారతి స్వామి పాల్గొని భక్తులకు ఆధ్యాత్మిక సందేశాలను అందించారు. ఈ కార్యక్రమంలో వేద ప్రకాశానందగిరి, అరుణానంద మాతాజీ, శ్రీశైలం మాతాజీతో పాటు హైదరాబాద్, ఆర్మూర్, నిజామాబాద్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, సేవకులు పాల్గొన్నారు.






# ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

**నిజామాబాద్ జిల్లా 23మార్చి(డీడీ9 వార్త) :**

ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులను ఏమాత్రం జాప్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాధితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా మొత్తం 140 ఫిర్యాదులు అందగా, కలెక్టర్ స్వయంగా బాధితుల నుంచి అర్జీలను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధితులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా అధికారులకు స్పష్టం చేశారు. బాధితులు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలపై అధికారులకు విన్నవించుకోగా, వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఇన్చార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, డీఆర్డీఓ సాయాగౌడ్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ఏసీపీ ప్రకాష్‌లతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డాక్టర్ కవితా రెడ్డికి ఘన సన్మానం

**నిజామాబాద్ జిల్లా 23మార్చి(డీడీ9 వార్త) :**

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ కవితా రెడ్డిని రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకలగా కలిసి ఘనంగా సన్మానించారు. సోమవారం నిజామాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో 369 రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గాదరి సంజీవ్ రెడ్డి ఆధ్వర్యంలో ఆమెకు శాలువా కప్పి పూలమాలలతో అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కీలకమైన పదవిలో బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కవితా రెడ్డి వైద్య రంగంలో మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి తగిన గుర్తింపు లభించడం పట్ల సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మోతే నవీన్ రెడ్డి, కోశాధికారి అరికెల శ్రీకాంత్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు వినోద్ రెడ్డి, సలహాదారులు నాగిరెడ్డి, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు : కాంగ్రెస్ తీరుపై ధ్వజం

**బోధన్, నిజామాబాద్ జిల్లా 23మార్చి(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ ముట్టడికి బీజేపీ పిలుపునిచ్చిన నేపథ్యంలో సోమవారం బోధన్ రూరల్ పోలీసులు ముందస్తు అరెస్టులు చేపట్టారు. బోధన్ మండల అధ్యక్షుడు సిర్ప సుదర్శన్, సాలూర మండల అధ్యక్షుడు రావుబా గంగాధర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ఆ వైఫల్యాలను ప్రశ్నిస్తుంటే అక్రమ అరెస్టులతో గొంతు నొక్కాలని చూస్తోందని ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మండిపడ్డారు. ముందస్తు అరెస్టులు ప్రజాస్వామ్య విరుద్ధమని, ఇచ్చిన హామీలను నెరవేర్చమని అడగడం తప్పా అని వారు ప్రశ్నించారు. ఎన్ని అరెస్టులు చేసినా, నిర్బంధాలు విధించినా ప్రజా సమస్యలపై తమ




పోరాటం ఆగదని స్పష్టం చేశారు. రైతులు, నిరుద్యోగులు మరియు సామాన్య ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసే వరకు బీజేపీ పోరాటాన్ని కొనసాగిస్తుందని నాయకులు పునరుద్ఘాటించారు. ఈ అరెస్టుల పట్ల స్థానిక బీజేపీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశాయి.

# శాంతిభద్రతల పరిరక్షణకు ఇంటర్సెప్టర్ వాహనం

**నిజామాబాద్ జిల్లా 23మార్చి(డీడీ9 వార్త) :**

జిల్లాలో నేరాల నియంత్రణతో పాటు ధర్నాలు, ఆందోళనల సమయంలో శాంతి భద్రతలను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు నూతనంగా ఇంటర్సెప్టర్ వాహనాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య వెల్లడించారు. సోమవారం నిజామాబాద్ పోలీస్ పరేడ్ మైదానంలో ఆయన జెండా ఊపి ఈ అత్యాధునిక వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రజల రక్షణే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తోందని, శాంతిభద్రతల పరిరక్షణలో ఈ వాహనం కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆధునిక సాంకేతికతతో కూడిన ఇటువంటి వాహనాలు పోలీసు యంత్రాంగానికి మరింత బలాన్నిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (ఏఆర్) రామచంద్రరావు, నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శేఖర్ బాబు (ఎంటీఓ), ధరణి కుమార్ (అడ్మిన్), సతీష్ (వెల్ఫేర్) తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



# పదో తరగతి పరీక్షల్లో కాపీయింగ్‌కు తావుండొద్దు : కలెక్టర్



**నిజామాబాద్ జిల్లా 23మార్చి(డీడీ9 వార్త) :**

పదవ తరగతి పరీక్షల నిర్వహణలో ఎక్కడా ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా, అత్యంత పారదర్శకంగా జరిపించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మానిక్ భవన్ పాఠశాలతో పాటు నలంద ఉన్నత పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును, విద్యార్థులు మరియు సిబ్బంది హాజరును నిశితంగా పరిశీలించారు. నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోనే ప్రశ్న పత్రాల బండిళ్లను తెరిచారా లేదా అన్న అంశాన్ని సీసీ కెమెరా ఫుటేజీల ద్వారా స్వయంగా నిర్ధారించుకున్నారు. కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, ఆరోగ్య కార్యకర్తల అందుబాటుపై ఆరా తీయడంతో పాటు, సిబ్బంది ఎవరైనా సెల్ ఫోన్లు వినియోగిస్తున్నారా అన్నది క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రాల్లో కాపీయింగ్‌కు ఏమాత్రం ఆస్కారం ఉండకూడదని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశ్న పత్రాలను పక్కాగా పోలీస్ బందోబస్తు మధ్య తరలించాలని, పరీక్షలు ముగిసే వరకు సిబ్బంది పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. కలెక్టర్ వెంట పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు జె.శంకర్, టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





# బోథ్ లో భగత్ సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా కాగడాల ప్రదర్శన

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మార్చ్ 23(డి డి 9):-**

బోథ్ లోని భగత్ సింగ్ కాలనీలో. భగత్ సింగ్ యూత్ ఆధ్వర్యంలో భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్ గురు.. ఈ ముగ్గురూ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా భరతమాత కోసం పోరాడిన మహావీరులు. వీరి పేర్లు వింటేనే భారతీయుల రక్తం దేశభక్తితో ఉప్పొంగిపోతుంది. అలాంటి దేశభక్తులను ఉరి తీసిన రోజు నేడే. 23 మార్చి, 1931న అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం వారిని ఉరితీసింది. 17, డిసెంబర్ 1928న బ్రిటన్ అధికారి శాండర్స్‌ను హత్య చేయడం, పార్లమెంట్‌లో బాంబులు వేయడం వంటి కారణాలను చూపి ముగ్గురినీ ఉరితీశారు. ఈ నేపథ్యంలోనే ప్రతి ఏటా ఆ రోజును అమరవీరుల దినోత్సవం(షహీద్ దివస్)గా జరుపుకుంటారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటం కేవలం రాజకీయ పోరాటంతోనే కాదు లక్షలాది మంది విప్లవకారుల ప్రాణ త్యాగాలతోనూ ముడిపడి ఉంది. ఎంతో మంది వీరులు నిస్సంకోచంగా, తృణప్రాయంగా భరతమాత కోసం ప్రాణాలను అర్పించారు.



# పోలీసు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: సీపీ

**నిజామాబాద్ జిల్లా 23మార్చి(డీడీ9 వార్త) :**

సామాన్య ప్రజలు ఎటువంటి మధ్యవర్తులు, పైరవీకారుల ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు మరింత చేరువవుతూ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తోందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి ద్వారా బాధితుల సమస్యలను నేరుగా తెలుసుకుని, చట్టప్రకారం వాటిని పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ఈ రోజు జరిగిన కార్యక్రమంలో మొత్తం 45 ఫిర్యాదులు అందగా సీపీ స్వయంగా బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో ఫోన్లో మాట్లాడి ఆయా ఫిర్యాదుల స్థితిగతులపై ఆరా తీశారు. బాధితులకు తక్షణ న్యాయం జరిగేలా చూడాలని, చట్టపరిధిలో సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రథమ కర్తవ్యంగా జిల్లా పోలీస్ యంత్రాంగం ముందుకెళ్తుందని ఆయన పునరుద్ఘాటించారు.




# వన్యప్రాణుల సంరక్షణ తోడ్పడిన వారికి సత్కారం

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మార్చ్ 23(డి డి 9):-**

బోథ్ అటవీ శాఖ ఎఫ్ ఆర్ వో ప్రణయ్ కుమార్ వన్యప్రాణుల గణన, అటవీ రక్షణలో చురుగ్గా పాల్గొనే నిపుణులు, స్థానిక ప్రజలను గుర్తించి సత్కరిస్తారు.అటవీ మరియు వన్యప్రాణుల సంరక్షణలో అసాధారణ కృషి చేస్తున్న వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలు మరియు అధికారులను ప్రభుత్వం.సంస్థలు సత్కరించాయి. ఈ గౌరవం పర్యావరణ పరిరక్షణ, అటవీ అగ్ని ప్రమాదాల నివారణ, వేట నిరోధం మరియు వన్యప్రాణుల ఆవాసాల రక్షణలో వారి నిబద్ధతకు గుర్తింపుగా ఇచ్చారు,



# లక్ష్యసాధనే విద్యార్థుల బాట కావాలి : సీపీ సాయి చైతన్య

**నిజామాబాద్ జిల్లా 23మార్చి(డీడీ9 వార్త) :** విద్యార్థులు పాఠశాల దశ నుంచే ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఆ దిశగా నిరంతరం కృషి చేయాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని వినాయక నగర్ కాలనీలో గల శ్రీ చైతన్య పాఠశాలలో నిర్వహించిన పురస్కారాల ప్రధానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇటీవల జరిగిన ఐఎన్‌టీఎస్‌ఓ సెకండ్ లెవెల్ పరీక్షల్లో ప్రతిభ చాటిన 115 మంది విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల ప్రిన్సిపల్ సిహెచ్. లత మాట్లాడుతూ.. జనవరిలో నిర్వహించిన రెండో విడత పరీక్షలకు తమ పాఠశాల నుంచి 205 మంది హాజరుకాగా, అందులో 115 మంది అర్హత సాధించడం గర్వకారణమన్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థిని శ్రీ బిందుశ్రీ మెగా గ్రాండ్ ప్రైజ్ కింద లెనోవో ట్యాబ్ అందుకోగా, ఐదో తరగతికి చెందిన అక్షర, హాసిని కృష్ణ ప్రథమ బహుమతిని, వైష్ణవి (10వ తరగతి), మనస్విన్ (6వ తరగతి) ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాల చైర్మన్ శ్రీధర్, శ్రీవిద్య, ఏజీఎం మహిపాల్ రెడ్డి, డీన్ రాజ్ కుమార్, ప్రైమరీ ఇంచార్జ్ ప్రవీణ మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.




# VOA లకు నీరు, పారిశుధ్యం మరియు పరిశుభ్రత (WASH) పై ఒకరోజు శిక్షణా కార్యక్రమం .

**సిరికొండ 23 మార్చ్ (డీడీ9 వార్త న్యూస్ ):** కొండ మండల కేంద్రంలోని మహిళా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గ్రామస్థాయి సిబ్బంది అయిన Village Organization Assistants (VOAs) మరియు OBలకు నీరు, పారిశుధ్యం మరియు పరిశుభ్రత (WASH) అంశాలపై అవగాహన పెంపొందించేందుకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ శిక్షణలో సురక్షిత తాగునీరు, పారిశుధ్యం, ఆరోగ్యకరమైన జీవనశైలి, మరుగుదొడ్ల వినియోగం, ఇంటి పరిసరాల పరిశుభ్రత మరియు ఘన వ్యర్థాల నిర్వహణ వంటి ముఖ్య అంశాలపై విపులంగా చర్చ జరిగింది. మహిళా అభివృద్ధి సంస్థ తరపున WASH తెలంగాణ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ బ్రహ్మచారి పాల్గొని, సురక్షితమైన తాగునీరు, పారిశుధ్యం మరియు మరుగుదొడ్ల ప్రాముఖ్యతపై వివరించారు. మంచి నీటి మూలాల వినియోగం, చేతులు కడుక్కోవడం (Handwashing) యొక్క ప్రాముఖ్యత, మరియు ఫీల్డ్ స్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎలా అధిగమించాలో సూచనలు అందించారు. జిల్లా ప్రాజెక్టు అధికారి మైత్రి.ప్రవీణ్ మాట్లాడుతూ, గ్రామాల్లో శుభ్రతపై అవగాహన పెంపొందించడం VOAs యొక్క ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రతి కుటుంబానికి సమయానికి సరైన సమాచారం అందించడంతో పాటు, ప్రతి ఇంటిలో మరుగుదొడ్ల నిర్మాణాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సూచించారు. అదేవిధంగా, ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామస్థాయిలో అమలు చేయాలని మరియు సంఘాల ద్వారా ప్రజలకు విస్తృతంగా చేరవేయాలని APMAS ప్రతినిధులు సూచించారు. APM కిరణ్ మాట్లాడుతూ, ప్రతి సంఘ సమావేశంలో WASH అంశాన్ని ఒక ముఖ్య అజెండాగా చేర్చి, ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. శిక్షణలో పాల్గొన్న VOAs ఈ కార్యక్రమం తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొంటూ, ఈ అంశాలను గ్రామస్థాయిలో అమలు చేసి కుటుంబాల ఆరోగ్యాన్ని మెరుగుపరచేందుకు కృషి చేస్తామని తెలిపారు. శిక్షణను నిర్వహించిన అధికారులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామారావు, రాజన్న, అనసూయ (CCలు), స్త్రీనిధి మేనేజర్ , మండల సమాఖ్య పదాధికారులు పట్ల.లక్ష్మి, మెస్రం.లక్ష్మి, కోశాధికారి నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడికి నిజామాబాద్ నేతల అభినందన

**నిజామాబాద్ జిల్లా 23మార్చి(డీడీ9 వార్త) :** టీపీసీసీ ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్ ను నిజామాబాద్ జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు రాజరాజ నరేందర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఓబీసీ సామాజిక వర్గాల సమస్యలను నరేందర్ గౌడ్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఈర్లపల్లి శంకర్.. ఓబీసీల సంక్షేమానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం మరియు పార్టీ పరంగా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లాకు చెందిన పలువురు ఓబీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







# కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని డిసిసి వైస్ ప్రెసిడెంట్ మరియు డిసిసి జనరల్ సెక్రెటరీ అన్నారు.

**సొంపల్లి 23 మార్చ్(డీడీ9 వార్త న్యూస్ ):** సిరికొండ మండలం సొంపల్లి గ్రామములో ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్‌ప్రెసిడెంట్ బగునూరే. మాధవ్ పటేల్ గారికి మరియు డిసిసి జనరల్ సెక్రెటరీ షేక్ ఇమామ్ గారికి సొంపల్లి సర్పంచ్ లక్ష్మికాంత్ తమ గ్రామములో శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సోంపల్లి గ్రామ సర్పంచ్ లక్ష్మీకాంత్ మాట్లాడుతూ, ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ గారి క్యాబినెట్లో సిరికొండ మండలానికి చెందిన ఇద్దరికీ పదవులు రావడం చాలా ఆనందంగా ఉందని, కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా అభివృద్ధి చెందే విధంగా బీసీ సమాజం నుండి బగునూరి మాధవ్ పటేల్ గారిని అలాగే షేక్. ఇమామ్ గారిని మంచి స్థానాన్ని కల్పించిన నరేంద్ర జాదవ్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపడం జరిగినది. రానున్న ఎంపిటిసి జెడ్పిటిసి ఎన్నికలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లగల సత్తా ఉన్నవారికి పదవులు ఇవ్వడం చాలా బాగుందని, సిరికొండ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని వారు ఈ సందర్భంగా మాట్లాడడం జరిగినది. ఈ కార్యక్రమంలో



సోంపల్లి గ్రామ సర్పంచ్ లక్ష్మీకాంత్ గారు ఇరువురికి శాలువాతో ఘనంగా సన్మానించి కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని రానున్న రోజులలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయాలని వారు అన్నారు. ఈ సందర్భంలో డీసీసీ జనరల్ సెక్రెటరీ షేక్. ఇమామ్,సిరికొండ ఉప సర్పంచ్ తోక. రాజు,శ్రీకాంత్ (రాయిగూడ),ప్రభాకర్ (పొన్న),బుద్ధజీ,మధుకర్,ముఖుంద్, శివాజీ,దమ్మాపాల్,తుకారాం,సొంకాంబ్లె.అనిల్, కొండిభ,మారుతీ, వీలాష్,రవికాంత్,గణేష్,దత్తా.కామ్రాజ్,రజినీకాంత్,రవికాంత్. పొడే.అనీ ల్,గాయక్వాడ్.నారాయణ్ పటేల్ మరియు సోంపల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలి: ఎంపీ అర్వింద్

**నిజామాబాద్ జిల్లా 23మార్చి(డీడీ9 వార్త) :** ఉత్తర తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన కీలకమైన రైల్వే ప్రాజెక్టులపై కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కోరారు. సోమవారం ఆయన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి జిల్లాలోని పెండింగ్ రైల్వే అంశాలపై చర్చించారు. నిజామాబాద్ జంక్షన్‌లో పిట్‌లైన్, కోచింగ్ డిపో ఏర్పాటుతో పాటు పలు రైళ్ల పొడిగింపు ప్రతిపాదనలకు తక్షణమే ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు. ప్రాంతీయ అభివృద్ధిలో రైల్వే అనుసంధానం ఎంతో కీలకమని, ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులను వేగవంతం చేయాలని మంత్రికి వివరించారు. నవీపేట్, ఇందల్వాయి వద్ద అదనపు ఆర్వోబీల నిర్మాణం, డిచ్‌పల్లి, అమ్మక్కపేట వద్ద ఆర్‌యూబీల ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీ కోరారు. జానకంపేట వద్ద ఆర్‌యూబీ విస్తరణతో పాటు నిజామాబాద్, మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, కరీంనగర్ మీదుగా తిరుపతికి నేరుగా రైళ్లు నడపాలని,



నిజామాబాద్ మీదుగా వందే భారత్ రైళ్లను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని విన్నవించారు. తన విజ్ఞప్తి మేరకు ఎడపల్లి వద్ద ఆర్‌ఓబీ నిర్మాణం, డిచ్‌పల్లిలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఆర్మూర్‌ఆదిలాబాద్ రైల్వే లైన్ పనులను మంజూరు చేసినందుకు ఈ సందర్భంగా ఆయన కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## భగత్ సింగ్ ఆశయ సాధనకు యువత నడుం బిగించాలి

**నిజామాబాద్ జిల్లా 23మార్చి(డీడీ9 వార్త) :** దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన విప్లవ వీరుడు భగత్ సింగ్ ఆశయాలను యువత పుణికిపుచ్చుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్ పిలుపునిచ్చారు. సోమవారం మాక్లూర్ మండలంలోని ఒడ్డాట్‌పల్లి గ్రామంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 95వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గంగాధర్ మాట్లాడుతూ... బ్రిటిష్ పాలకుల గడ్డపై నుంచి తరిమికొట్టేందుకు ప్రాణాలను తృణప్రాయంగా వదిలిన అమరవీరుల పోరాట ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి దశాబ్దాలు గడుస్తున్నా.. నేటికీ నిజమైన ఆర్థిక,



సామాజిక స్వేచ్ఛ లభించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ సమస్య దేశాన్ని పీడిస్తోందని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న కేంద్ర ప్రభుత్వం ఆ హామీని నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. యువతకు తక్షణమే ఉపాధి అవకాశాలు కల్పించాలని, మరో స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో నిరుద్యోగులు తమ హక్కుల కోసం సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమేష్, కవిత, రాజు తదితరులు పాల్గొన్నారు.

## వార్డు సభ్యులు గ్రామ వికాసానికి కృషి చేయాలి:ఎంపీడీవో శ్రీనివాస్

**బోధన్, నిజామాబాద్ జిల్లా 23మార్చి(డీడీ9 వార్త) :** గ్రామాల్లో పాలనను మరింత పటిష్టం చేసేందుకు వార్డు సభ్యులు తమ బాధ్యతలను తెలుసుకోవాలని, గ్రామ వికాసానికి అంకిత భావంతో కృషి చేయాలని సాలూర ఎంపీడీవో శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఐదో బ్యాచ్ వార్డు సభ్యుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకు జరిగే ఈ శిక్షణలో పంచాయతీ రాజ్ చట్టాలు, గ్రామాభివృద్ధి ప్రణాళికలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హున్సా పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గోవూర్ కార్యదర్శి రాజశేఖర్, సిద్ధాపూర్ కార్యదర్శి ప్రణవ్, కందకుర్తి కార్యదర్శి నాగరాజులు శిక్షకులుగా వ్యవహరిస్తూ వార్డు సభ్యులకు వివిధ అంశాలపై



దిశానిర్దేశం చేశారు. అనంతరం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సక్రమంగా అందేలా చూడాలని అంగన్‌వాడీ టీచర్ సత్య గంగామణికి సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులపై వేధింపులు ఆపాలి : కార్మిక సంఘాల డిమాండ్




**నిజామాబాద్ జిల్లా 23మార్చి(డీడీ9 వార్త) :** మున్సిపల్ కార్మికులపై అధికారుల వేధింపులను తక్షణమే నివారించాలని, వారిపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. టీయుసీఐ, సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘాల నేతృత్వంలో కార్మికులు తరలివచ్చి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీయుసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ.. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు తమ న్యాయమైన వేతనాలు, డిమాండ్ల గురించి అడిగితే కేసులు పెట్టడం అధికారుల నిరంకుశత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. కాంటాక్ట్ ఏజెన్సీ కార్మికులకు వేతనాలు చెల్లించి, సీఐజీ గ్రూపుల కార్మికులకు ఇవ్వకపోవడం కక్షాపూరిత వైఖరేనని ధ్వజమెత్తారు. కార్మికులకు నెలకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ యూనిఫాం, సబ్బులు, నూనెలు వంటి రక్షణ పరికరాలను వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత సీఐజీ గ్రూపులను కొనసాగిస్తూనే, ఇతర ఏజెన్సీ కార్మికులను కూడా గ్రూపులుగా చేయాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. సమస్యలు పరిష్కరించే వరకు తమ ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ. రమేష్ బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి పి. సుధాకర్, నాయకులు కిరణ్, రవి, యాదమ్మ, శాంతికుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## నేడు టిబి ముక్త భారత్ అభియాన్ 2.0 ప్రారంభం

**నిజామాబాద్ జిల్లా 23మార్చి(డీడీ9 వార్త) :** ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఏడవ అంతస్తు సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి.రాజశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా టిబి ముక్త భారత్ అభియాన్ 2.0 కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలన కోసం 155 గ్రామాలను హై రిస్క్ ప్రాంతాలుగా గుర్తించామని, ఆయా గ్రామాల్లోని ప్రజలందరికీ హ్యాండ్ హెల్డ్ ఎక్స్రే మిషన్ల ద్వారా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. క్షయ రహిత జిల్లాగా మార్చేందుకు వైద్యశాఖ అన్ని విధాలా కృషి చేస్తోందని వివరించారు. గత ఏడాది కాలంలో టిబి ముక్త భారత్ 1.0 ద్వారా సుమారు 3.42 లక్షల మందికి స్క్రీనింగ్ నిర్వహించగా, 2.09 లక్షల మందికి వివిధ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు డాక్టర్ రాజశ్రీ వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా 425 ఆరోగ్య శిబిరాల ద్వారా 413 మంది కొత్త క్షయ రోగులను



గుర్తించి వారికి తక్షణ వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం అందించడంలో భాగంగా డీబీటీ ద్వారా 2093 మందికి న్యూట్రిషన్ కిట్లు అందజేశామని, నిక్షయ్ మిత్ర పథకం కింద మరో 250 మందికి నెలకు వెయ్యి రూపాయల చొప్పున ఆరు నెలల పాటు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గత ఏడాది జిల్లాలో 18 గ్రామ పంచాయతీలను క్షయ రహిత గ్రామాలుగా గుర్తించడం జరిగిందని, ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో ముందుకు సాగుతున్నామని తెలిపారు. మంగళవారం జరిగే కార్యక్రమంలో క్రమం తప్పకుండా మందులు వాడుతూ వ్యాధిని జయించిన టీబి ఛాంపియన్లకు 'బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఆమె వివరించారు.

# 'సంబరాల ఏటిగట్టు'లో సీనియర్ హీరో క్రేజీ రోల్! చూస్తే షాక్ కావాల్సిందే..

సుప్రీం హీరో సాయి దుర్గా తేజ్ హీరోగా, రోహిత్ కె.పి దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం "SYG" (సంబరాల ఏటిగట్టు). 'హనుమాన్' వంటి గ్లోబల్ బ్లాక్ బస్టర్ అందించిన ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ నుంచి ఒక ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ చిత్రంలో సీనియర్ హీరో శ్రీకాంత్ ఒక కీలకమైన, పవర్‌ఫుల్ రోల్ చేస్తున్నారు. ఈరోజు శ్రీకాంత్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర యూనిట్ ఆయన పాత్రకు సంబంధించిన ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ సినిమాలో ఆయన 'బ్రిటిషు' అనే పాత్రలో కనిపించబోతున్నారు. తాజాగా రిలీజ్ చేసిన పోస్టర్‌లో ఆయన లుక్ అదిరిపోయింది.
ఒంటిపై ఉన్న ప్రతి గాయాన్ని ఒక పతకంలా ధరించే మొండి ధైర్యం గల సైనికుడిగా శ్రీకాంత్ లుక్ చాలా రఫ్ అండ్ టఫ్ గా ఉంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన 'అసుర ఆగమన' గ్లింప్స్ సంచలనం సృష్టించగా, ఇప్పుడు శ్రీకాంత్ పోస్టర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఈ సినిమా కోసం టాప్ క్లాస్ టెక్నికల్ టీమ్ వర్క్ చేస్తుంది. ఈ చిత్రానికి బి.అజనీష్ లోకనాథ్ (కాంతార ఫేమ్) సంగీతం అందిస్తుండగా, వెట్రివేల్ పళనిసామి సినిమాటోగ్రఫీ, నవీన్ విజయకృష్ణ ఎడిటింగ్ చేస్తున్నారు. ఈ చిత్రంలో సాయి దుర్గా తేజ్ సరసన ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తుండగా.. జగపతి బాబు, సాయి కుమార్, అనన్య నాగళ్ల వంటి నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానున్న ఈ చిత్రం, ఈ ఏడాది టాలీవుడ్‌లో వస్తున్న బిగ్గెస్ట్ సినిమాటిక్




ఈవెంట్‌గా నిలవనుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది

## బంపర్ ఆఫర్ అందుకున్న మానస వారణాసి



అందం, అభినయం కలగలిసిన టాలీవుడ్ యంగ్ సెన్సేషన్, మాజీ మిస్ యూనివర్స్ ఇండియా మానస వారణాసి ఇప్పుడు సౌత్ ఇండియాలో హాట్ టాపిక్‌గా మారారు. 'దేవకీ నందన వసుదేవ'తో వెండితెరకు పరిచయమైన ఈ బ్యూటీ, ఇటీవలి బ్లాక్ బస్టర్ 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో యూత్‌లో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఆమె హవా చూస్తుంటే, మానస బాక్సాఫీసును షేక్ చేయడం ఖాయమనిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం.. మానసకు కోలీవుడ్‌లో ఒక బంపర్ ఆఫర్ తలుపు తట్టింది. ఇటీవలే 'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న విలక్షణ నటుడు శశికుమార్ సరసన హీరోయిన్‌గా నటించే ఛాన్స్ మానసను వరించింది.
ఈ క్రేజీ ప్రాజెక్టును టాలెంటెడ్ డైరెక్టర్ మణికందన్ తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో శశికుమార్ ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నారు. అటు మాస్ యాక్షన్, ఇటు క్లాస్ ఎమోషన్స్ కలగలిసిన ఈ కథలో మానస పాత్ర చాలా కీలకంగా ఉండబోతోందని టాక్. ఇప్పటికే టాలీవుడ్‌లో వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్న ఈ అమ్మడు, ఇప్పుడు తమిళ పరిశ్రమలోకి గ్రాండ్‌గా ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. నెట్టింట వైరల్ అవుతున్న ఈ వార్తతో మానస అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఒకేసారి స్టార్ హీరో, పెద్ద డైరెక్టర్‌తో కోలీవుడ్ ప్రయాణం మొదలుపెట్టడం మానస కెరీర్‌లో ఒక పెద్ద టర్నింగ్ పాయింట్ అని చెప్పవచ్చు.

## ఆదిత్య ధర్ నీకు సెల్యూట్

చిత్రపరిశ్రమలోకి రావాలనే ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు ఆదిత్యధర్ అంటూ ఆయనపై ప్రశంసల వర్షం కురిపించింది ప్రముఖ కథానాయిక కంగనా. 'ధురంధర్ ది రివెంజ్' చిత్రాన్ని దర్శకుడు ఆదిత్యధర్ తీర్చిదిద్దిన తీరుకి ఆమెకు ఎంతగానో నచ్చిందంటూ ఇన్‌స్టా స్టోరీలో తన అభిప్రాయాల్ని పంచుకుంది. ''ధురంధర్' విజయంలో గొప్ప విషయం ఏమిటంటే ఆదిత్య ధర్ ఒక సూపర్ స్టార్ దర్శకుడిగా మంచి పేరు సంపాదించుకున్నారు. హాలీవుడ్ స్టార్ దర్శకులు ఎల్లప్పుడూ నటుల కంటే గొప్పవారు. కానీ, మనం మన చిత్రనిర్మాతలకు ఎప్పుడూ తగినంత గౌరవం, గుర్తింపు ఇవ్వము. వాళ్లు ఎంత కష్టపడినా తక్కువ జీతాలే పొందుతారు. అంతేకాదు సూపర్ స్టార్ల చేత వేధింపులకు కూడా గురవుతారు.
దాని ఫలితంగానే ఇండస్ట్రీలో నిర్మాతగానో, సినిమాటోగ్రాఫర్‌గానో మరే ఇతర సాంకేతిక నిపుణుడిగానో కావాలని కలలు కనే ఏ యువకుణ్ని (ఇన్‌సైడర్, అవుట్‌సైడర్) నేను కలవలేదు. ప్రతి ఒక్కరూ తాము ప్రతిభావంతులమని చెప్పుకుంటారు. కానీ, వారు కేవలం నటులు కావాలని మాత్రమే కోరుకుంటారు. ఇప్పుడు ఇక్కడ హీరోల కన్నా ఎక్కువగా వెలిగిపోతున్న ఒక సూపర్ స్టార్ దర్శకనిర్మాత ఉన్నారు. ఈరోజు ఎంతోమంది యువత ఆయన రూపొందించిన కథను చూస్తున్నారు. వారు ఆయనలా అవ్వాలని ఆకాంక్షించి చిత్రపరిశ్రమను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తారు!! సెల్యూట్ ఆదిత్య ధర్" అని ఆ పోస్ట్‌లో రాసింది కంగనా.



## పవన్ ఎలాంటి ప్రాజెక్టులు ఓకే చేయలేదు!

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేనాని పవన్ కళ్యాణ్ సినిమాలపై గత కొద్దిరోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న వార్తలకు ఒక స్పష్టత వచ్చింది, పవన్ కళ్యాణ్ తన రాజకీయ బాధ్యతలతో బిజీగా ఉండటంతో, ఆయన కొత్త సినిమాల గురించి రకరకాల ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. అయితే, తాజా సమాచారం ప్రకారం పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఎటువంటి కొత్త సినిమా ప్రాజెక్టులకు సంతకం చేయలేదు. ప్రస్తుతానికి పవన్ కళ్యాణ్ కేవలం ప్రజా సేవకే పరిమితమయ్యారు. కొత్తగా ఏవైనా సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే వార్తల్లో వాస్తవం లేదు. "ఆయన కొత్త సినిమాలను ప్రారంభించే ఆలోచనలో ఇప్పుడప్పుడే లేరు. ఒకవేళ భవిష్యత్తులో ఏదైనా సినిమా ప్రాజెక్ట్ ఖరారైతే, అది అధికారికంగా ప్రకటిస్తారు" అని పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ అధికారికంగా ప్రకటించింది. అప్పటివరకు అనవసరమైన ప్రచారాలను నమ్మవద్దని సూచించారు.Movies పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా



ఎదురుచూస్తున్న చిత్రం OG సీక్వెల్ గురించి నెట్టింట చర్చ జరుగుతోంది. అయితే, OG2 గురించి ఏవైనా వివరాలు ఉంటే, అవి నేరుగా పవన్ కళ్యాణ్ గారే సరైన సమయంలో స్వయంగా పంచుకుంటారు. అంతవరకు ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడదు అని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కీలక బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ప్రజల సమస్యల పరిష్కారం, రాష్ట్ర అభివృద్ధిపైనే ఆయన పూర్తి దృష్టి పెట్టారు. సినిమా షూటింగ్‌ల కంటే ప్రజా క్షేత్రంలో ఉండటానికే ఆయన ప్రాధాన్యత ఇస్తున్నారు. కాబట్టి, మెగాభిమానులు, జనసైనికులు అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

## సక్సెస్ లేకపోయినా తగ్గేదేలే..

టాలీవుడ్ సెన్సేషనల్ డాన్సింగ్ క్వీన్ శ్రీలీల ప్రస్తుతం కెరీర్ పరంగా అదృష్టం కలిసి రావడం లేదు. వరుస సినిమాల్లో నటిస్తున్నప్పటికీ, ఆమెకు ఆశించిన స్థాయిలో సక్సెస్ లభించడం లేదు. తాజాగా పవన్ కళ్యాణ్ సరసన నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' భారీ అంచనాల మధ్య విడుదలైనప్పటికీ, బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. దీంతో సోషల్ మీడియాలో నెటిజన్లు శ్రీలీలను టార్గెట్ చేసి దారుణంగా ట్రోల్ చేస్తున్నారు. తనపై వస్తున్న ఈ విమర్శలు, నెగిటివిటీపై శ్రీలీల తాజాగా తనదైన శైలిలో స్పందించారు. గతంలో ఇలాంటి విషయాలు తనను ఎంతలా బాధించాయో వివరిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "సినిమా ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో ఈ ట్రోలింగ్ చూసి చాలా బాధపడేదాన్ని. ఒక్కోసారి తట్టుకోలేక చాలా ఏడ్చేదాన్ని కూడా.
అసలు ఇండస్ట్రీలో నేను కొనసాగగలనా? నా వల్ల అవుతుందా? అనే అనుమానంతో ఇక్కడి నుంచి వెళ్లిపోదామని కూడా అనుకున్నాను. అప్పుడు నేను చాలా సున్నిత మనస్కురాలిని" అని ఆమె తన గతాన్ని గుర్తు చేసుకున్నారు. అయితే ఇప్పుడు తను చాలా మారిపోయానని, ఇలాంటి విమర్శలను ఎదుర్కొనే ధైర్యం వచ్చిందని ఆమె చెప్పుకొచ్చారు. "సోషల్ మీడియాలో ఏదైనా నెగిటివిటీ చూసినప్పుడు, అది ఫేక్ అని తెలుసుకునే వారు కూడా ఉన్నారు. కానీ నిరంతరం నెగిటివిటీని చూస్తూ ఉంటే, అది తెలియకుండానే మన సొంత ఆలోచనలను, మన వ్యక్తిత్వాన్ని కూడా మార్చేస్తుంది. అందుకే ఇప్పుడు నేను వాటిని పట్టించుకోవడం తగ్గించాను" అని శ్రీలీల స్పష్టం చేశారు. వరుస పరాజయాలు ఎదురవుతున్నా, తన నటన, డాన్స్‌తో ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్న ఈ బ్యూటీ, త్వరలోనే ఒక భారీ హిట్‌తో మళ్ళీ ఫామ్‌లోకి రావాలని ఆమె అభిమానులు కోరుకుంటున్నారు.



## క్లాసీ లుక్‌తో మైండ్ బ్లోయింగ్ పోజ్

హాటెస్ట్ బ్యూటీ ఐశ్వర్య మీనన్ 'కాదలిల్ సోదప్పువదు ఎప్పడి' అనే తమిళ చిత్రంతో వెండితెరకు పరిచయం అయింది. ఎమ్. ఎస్. రమేష్ దర్శకత్వం వహించిన 'దశావళ' సినిమాతో కన్నడ ఇండస్ట్రీలోకి, 'మాన్సూన్ మంగోస్' చిత్రంతో మలయాళ చిత్ర పరిశ్రమలోకి కూడా అడుగుపెట్టింది.
ఇక 2023లో విడుదలైన 'స్పై' సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా, ఐశ్వర్య మీనన్‌కు మాత్రం మంచి గుర్తింపును తీసుకొచ్చింది.
ఆ తర్వాత ఈమె కార్తికేయ సరసన 'భజే వాయువేగం' సినిమాలో హీరోయిన్‌గా నటించింది. ఈ మూవీ మంచి విజయాన్ని సాధించగా, ఇందులో ఐశ్వర్య తన నటనతో పాటు అందాలతో ప్రేక్షకులను అలరించింది. అయితే ఇప్పటివరకు తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో సినిమాలు చేసినప్పటికీ భారీ స్థాయి గుర్తింపును మాత్రం సంపాదించుకోలేకపోయింది. అలాగే వరుస అవకాశాలను కూడా పెద్దగా అందుకోలేకపోతుంది.
సినిమాల ద్వారా ప్రేక్షకులను పెద్దగా అలరించకపోయినా, సోషల్ మీడియాలో మాత్రం ఐశ్వర్య మీనన్ మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. ఎప్పటికప్పుడు తనకు సంబంధించిన హాట్ ఫోటోలను పోస్ట్ చేస్తూ కుర్రకారును ఆకట్టుకుంటోంది.
తాజాగా ఈ బ్యూటీ తెలుపు రంగులో ఉన్న పొట్టి స్లీవ్‌లెస్ డ్రెస్ ధరించి సోఫాపై కూర్చొని స్టైలిష్ లుక్‌లో ఫోటోకు స్టిల్ ఇచ్చింది. ఇందులో ఐశ్వర్య తలపై సిల్వర్ హెడ్‌చైన్ ఆభరణం ధరించి, చేతికి ఆకర్షణీయమైన జ్యువెలరీ వేసుకుంది.అలాగే తన కురులను వదిలేసి వన్ సైడ్ చూస్తూ హాట్ అందాలను ఒలకబోసే విధంగా ఉన్న ఈ ఫోటోను తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ప్రస్తుతం ఈ పిక్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



## ఐకాన్ స్టార్ ఫ్యాన్స్‌కు ఊహించని సర్ ప్రైజ్..

టాలీవుడ్‌లో గత కొంతకాలంగా రీరిలీజ్ ట్రెండ్ ఊపు అందుకున్న సంగతి తెలిసిందే. ఒకప్పుడు థియేటర్లలో సందడి చేసిన క్లాసిక్ సినిమాలు, బ్లాక్ బస్టర్ హిట్లు మళ్లీ వెండితెరపై మెరుస్తూ బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్నాయి. కొన్ని సినిమాలు అప్పట్లో ఆశించిన స్థాయిలో ఆడకపోయినా, ఇప్పుడు రీరిలీజ్‌లో మాత్రం సరికొత్త రికార్డులు సృష్టిస్తూ బ్లాక్ బస్టర్ అనిపించుకుంటున్నాయి. ఈ క్రమంలోనే ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అభిమానులకు ఒక అదిరిపోయే శుభవార్త అందింది. స్టైలిష్ స్టార్ నుంచి ఐకాన్ స్టార్‌గా ఎదిగిన అల్లు అర్జున్ కెరీర్‌లో మైలురాయిగా నిలిచిన సినిమా 'రేసు గుర్రం'. సురేందర్ రెడ్డి దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం అప్పట్లో బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. ఇప్పుడు ఈ మూవీని మళ్లీ థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ ప్లాన్ చేశారు. అల్లు అర్జున్ పుట్టినరోజు (ఏప్రిల్ 8) సందర్భంగా, అభిమానుల కోరిక మేరకు ఏప్రిల్ 26న ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా రీరిలీజ్ చేయబోతున్నారు. ఈ రీరిలీజ్ వేడుకను మరింత స్పెషల్‌గా మార్చేందుకు ఏప్రిల్ 8న, అంటే బన్నీ బర్త్‌డే రోజున 'రేసు గుర్రం' రీరిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. ఐకాన్ స్టార్ మాస్ మేనరిజమ్స్, శ్రుతి హాసన్ గ్లామర్, బ్రహ్మానందం కిల్ బిల్ పాండే కామెడీని మళ్లీ బిగ్ స్క్రీన్‌పై చూడబోతున్నామన్న వార్తతో అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. థియేటర్లలో మళ్ళీ 'దేవుడా..'



అంటూ బన్నీ చేసే రచ్చ చూడాలని ఫ్యాన్స్ ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో